

రొట్టెల పండుగ ఏర్పాట్లపై మంత్రి నారాయణ సమీక్ష

3 లో

RNI : APTEL/2023/87662

# సింధూర దర్శిని

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రతి అక్షరం అవినీతి పై సమరం

WWW.SINDHURADARSINI.COM WWW.EPAPER.SINDHURADARSINI.COM

**విలేకరులు కావలెను**

సింధూరదర్శిని జాతీయ తెలుగు దినపత్రికలో జిల్లాల వారీగా పనిచేయుటకు జిల్లా ఇన్చార్జీలు మరియు మండలాల వారీగా పనిచేయుటకు విలేకరులు కావలెను. ఎలాంటి వేతనం ఇవ్వబడదు. యాడ్స్ పై ఆకర్షణీయమైన కమిషన్ ఇవ్వబడును. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. వివరాల కొరకు బయోడేటాతో క్రింది నంబర్‌ను సంప్రదించండి.

సెల్ నెంబర్ : 7 5 6 9 6 7 7 1 7 0

ప్రచురణ: తిరుపతి సంపుటి:3 సంచిక :195 సంపాదకులు: కలిచేటి వెంకయ్య శుక్రవారం 12 జూన్ 2026 పేజీలు: 8 వెల:2

Circulated At :Tirupathi, Chittoor, Kadapa, SPSR Nellore, karnool, Prakasam, Hydrabad



## దేశంలో డిజిటల్ కామర్స్ విప్లవం..
# ఓఎన్‌డీసీతో మారనున్న రూపురేఖలు

- రిటైల్, డిస్ట్రిబ్యూషన్ వ్యవస్థల ఆధునికీకరణపై పీయూష్ గోయల్ సమీక్ష
- చిన్న ఉత్పత్తిదారులను డిజిటల్ వేదికల్లోకి చేర్చడమే ప్రధాన లక్ష్యం
- ఓఎన్‌డీసీలో వ్యూహాత్మక పెట్టుబడులు పెట్టిన ఈబర్, జోహో సంస్థలు
- ఓఎన్‌డీసీపై పీయూష్ గోయల్ కీలక సమీక్ష

**న్యూఢిల్లీ:**దేశంలో రిటైల్, పంపిణీ వ్యవస్థల ఆధునీకరణకు ఓపెన్ డిజిటల్ నెట్‌వర్క్‌లను సమర్థంగా వినియోగించుకో వడంపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్.. ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ (ఓఎన్‌డీసీ), దాని అనుబంధ సంస్థ నిర్మిత్ భారత్ ప్రతినిధులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో చిన్న ఉత్పత్తిదారులు, కళాకారులను డిజిటల్ వేదికల పరిధిలోకి తీసుకురావడం, లాజిస్టిక్స్, మొబిలిటీ సేవలను మెరుగు పరచడం వంటి కీలక అంశాలపై ప్రధానంగా చర్చించారు. ఈ ప్రయత్నాలు మార్కెట్ లభ్యతను పెంచడంతో పాటు సేవల పంపిణీని మెరుగుపరుస్తాయని, తద్వారా విస్తృత ఆర్థిక

మిగతా 2లో...

# ఏపీ రాజ్యసభ ఎన్నికలు ఏకగ్రీవం

- కూటమి ఖాతాలోకి మరో నలుగురు ఎంపీలు
- ప్రత్యర్థి పార్టీల నుంచి రాని నామినేషన్లు
- టీడీపీ తరపున విజయ్, భాష్యం రామకృష్ణ, సానా సతీశ్ గెలుపు
- జనసేన నుంచి లింగమనేని రమేశ్ జయకేతనం



**న్యూఢిల్లీ:**ఆంధ్రప్రదేశ్ కోటాలో ఖాళీ అయిన నాలుగు రాజ్యసభ స్థానాల ఎన్నిక ప్రక్రియ ఏకగ్రీవం అయింది. కూటమిలో భాగంగా తెలుగుదేశం పార్టీ నుంచి ముగ్గురు, జనసేన పార్టీ నుంచి ఒకరిని ఆయా

మిగతా 2లో...

# ద్రోణి ప్రభావం

- నేడు ఏపీలోని పలు జిల్లాల్లో ఈదురుగాలులతో వర్షాలు
- రాయలసీమ, మార్కాపురం ప్రాంతాల్లో మోస్తరు వర్షాల అంచనా
- విశాఖలో ఈదురుగాలులకు నష్టం.. విరిగిన చెట్లు, కరెంట్ స్తంభాలు
- అప్రమత్తంగా ఉండాలన్న విపత్తుల సంస్థ



**అమరావతి, సింధూరదర్శిని:**

ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో గురువారం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ (APSDMA) వెల్లడించింది. మధ్య బంగాళాఖాతం నుంచి కర్ణాటక, కోస్తాంధ్ర,

మిగతా 2లో...

# మీనాక్షి నటరాజన్ పిటిషన్‌పై విచారణకు సుప్రీంకోర్టు ఓకే..


- ఫలితాలపై స్టేకు నిరాకరణ
- మీనాక్షి పిటిషన్‌పై శుక్రవారం విచారణ
- ఎన్నికల ఫలితాలపై స్టేకు కోర్టు నిరాకరణ
- తెలంగాణ కేసు వివరాలపై వివాదం
- నామినేషన్ తిరస్కరణను సవాల్ చేసిన కాంగ్రెస్ నేత



**సింధూరదర్శిని:**మధ్యప్రదేశ్ రాజ్యసభ ఎన్నికలకు సంబంధించిన వివాదంలో కాంగ్రెస్ నేత మీనాక్షి నటరాజన్‌కు సుప్రీంకోర్టులో కొంత

# నీతి ఆయోగ్ భేటీలో 'స్వర్ణాంధ్ర @2047' విజన్

- సీఎం చంద్రబాబు కీలక ప్రజంటేషన్
- నీతి ఆయోగ్ సమావేశంలో 'స్వర్ణాంధ్ర @2047' విజన్‌ను ఆవిష్కరించిన సీఎం చంద్రబాబు
- మానవ వనరుల ఆధారిత అభివృద్ధి, టెక్నాలజీ పాలనపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు వెల్లడి
- గత రెండేళ్లలో రూ.23 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులను ఆకర్షించామని స్పష్టం
- ప్రోత్సాహకాల పోటీ కాకుండా సుస్థిర అభివృద్ధిపై రాష్ట్రాలు దృష్టి పెట్టాలని పిలుపు
- రాష్ట్రంలో సంతానోత్పత్తి రేటు తగ్గుదలపై జాతీయ స్థాయిలో దృష్టి సారించాలని విజ్ఞప్తి




**న్యూఢిల్లీ:**ఢిల్లీ వేదికగా జరిగిన 11వ నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర సమగ్రాభివృద్ధికి సంబంధించిన కీలక ప్రణాళికను ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వ 'వికసిత భారత్ @2047' లక్ష్యానికి అనుగుణంగా 'స్వర్ణాంధ్ర @2047' విజన్‌ను ఆయన సభ్యుల ముందుంచారు. ఈ విజన్ ద్వారా రాష్ట్రాన్ని సంపన్న, సమ్మిళిత, ప్రపంచ పోటీతత్వ ఆర్థిక వ్యవస్థగా మార్చడమే లక్ష్యమని స్పష్టం చేశారు. మానవ వనరుల ఆధారిత అభివృద్ధి నమూనాను అమలు చేస్తామని చంద్రబాబు వివరించారు. దీని ద్వారా సంపూర్ణ పేదరిక నిర్మూలన, భారీ ఎత్తున ఉపాధి అవకాశాల కల్పన, నైపుణ్యాభివృద్ధి, జల, ఇంధన భద్రత కల్పించడం తమ ప్రభుత్వ ప్రాధాన్యతలని తెలిపారు. వ్యవసాయ-టెక్, లాజిస్టిక్స్, డీప్-టెక్ వంటి రంగాలను అనుసంధానిస్తూ అభివృద్ధిని వేగవంతం చేస్తామని అన్నారు. పాలనలో పారదర్శకత, సామర్థ్యం పెంచేందుకు రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (RTGS), ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారితవిశ్లేషణలు, రియల్‌టైమ్‌మానిటరింగ్ వ్యవస్థలు, 'అవేర్' (AWARE) వంటి ముందస్తు అంచనా సాధనాలను వినియోగిస్తున్నామని, ఇవి మెరుగైన పౌర సేవలకు దోహదపడుతున్నాయని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం తీసుకొచ్చిన పాలనా సంస్కరణలు,

మిగతా 2లో...

# లక్షలాది మంది జీవితాలతో ఆడుకున్నారు

- డీఎస్సీ స్కామ్‌పై సీబీఐ దర్యాప్తు జరిపించాలి: వైఎస్ జగన్
- మెగా డీఎస్సీలో భారీ కుంభకోణం జరిగిందన్న వైఎస్ జగన్
- నియామక ప్రక్రియపై సీబీఐతో విచారణ జరిపించాలని డిమాండ్
- స్పోర్ట్స్ కోటాలో అక్రమాలకు పాల్పడి తమవారికి ఉద్యోగాలిచ్చారని ఆరోపణ
- చంద్రబాబు, లోకేశ్‌లే ముద్దాయిలు కాబట్టి న్యాయం జరగదని వ్యాఖ్య



**అమరావతి, సింధూరదర్శిని:** ఏపీ మెగా డీఎస్సీ పరీక్ష, నియామకాల ప్రక్రియలో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగాయని, దీనిపై సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ)తో విచారణ జరిపించాలని వైసీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్ డిమాండ్ చేశారు. నేడు ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ డీఎస్సీకి సంబంధించి వెలుగులోకి వస్తున్న వాస్తవాలు అత్యంత దిగ్భ్రాంతికరంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం కుంభకోణాలతో లక్షలాది మంది అభ్యర్థుల నమ్మకాన్ని వమ్ము చేసిందని, ప్రతిభావంతులైన నిరుద్యోగుల జీవితాలను తీవ్రంగా దెబ్బతీసిందని జగన్ ఆరోపించారు. ఇంతటి దారుణమైన నియామక ప్రక్రియను ఎక్కడా చూడలేదని అన్నారు. "అబద్ధాలు, మోసం,

మిగతా 2లో...

# అక్టోబర్‌లో మెగా డిఎస్సీ నోటిఫికేషన్

- డిసెంబర్‌లో పరీక్షలు...అభ్యర్థులు సన్నద్ధం కావాలి
- డిఎస్సీ ఎంపికల్లో ఎలాంటి అక్రమాలు లేవు పూర్తి పారదర్శకతతోనే నియామక ప్రక్రియ నిర్వహించాం
- రాష్ట్ర విద్యా శాఖ కార్యదర్శి కోన శశిధర్

**అమరావతి, సింధూరదర్శిని:**



రాష్ట్రంలో ఉపాధ్యాయ నియామకాల కోసం ఎదురుచూస్తున్న లక్షలాది మంది నిరుద్యోగ యువతకు ప్రభుత్వం మరో సారి శుభవార్త అందించింది. ప్రభుత్వం ప్రకటించిన జాబ్ క్యాలెండర్‌కు అనుగుణంగా అక్టోబర్ నెలలో మెగా డిఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు, డిసెంబర్ నెలలో పరీక్షలు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించినట్లు రాష్ట్ర విద్యా శాఖ కార్యదర్శి కోన శశిధర్ తెలిపారు. గురువారం రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగంలో రాష్ట్ర క్రీడల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్, శాప్ వైస్ చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ భరణితో కలసి ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ డిఎస్సీ-2025 నియామకాలపై మరొక సారి సమగ్ర వివరణ ఇచ్చారు. డీఎస్సీ-2025 నియామకాల్లో హారిజాంటల్ రిజర్వేషన్లు, స్పోర్ట్స్ కోటా, దివ్యాంగుల కోటా అమలుపై కొంత మంది అభ్యర్థులు వ్యక్తం చేస్తున్న సందేహాలు, సోషల్ మీడియాలో జరుగుతున్న తప్పుడు ప్రచారాల్లో ఏమాత్రం నిజం లేదని ఆయన స్పష్టం చేశారు.

మిగతా 2లో...

## దేశంలో డిజిటల్ కామర్స్ విప్లవం.. ఓఎన్‌డీసీతో మారనున్న రూపురేఖలు

(మొదటిపేజీ తరువాయి)

భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తాయని పీయూష్ గోయల్ సోషల్ మీడియా వేదిక 'ఎక్స్' ద్వారా వెల్లడించారు. ప్రభుత్వ మద్దతుతో కార్యకలాపాలు సాగిస్తున్న ఓఎన్‌డీసీ, డిజిటల్ వాణిజ్యంలో భాగస్వాములందరికీ సమాన అవకాశాలు కల్పించే దిశగా కృషి చేస్తోంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రిటైల్, లాజిస్టిక్స్, మొబిలిటీ, ఆర్థిక సేవల రంగాల్లో కలిపి మొత్తం 218 మిలియన్ల లావాదేవీలను నమోదు చేయడం ద్వారా తన వృద్ధిని చాటుకుంది. భారతదేశ డిజిటల్ మౌలిక సదుపాయాలపై ప్రైవేటు రంగానికి గల విశ్వాసం పెరుగుతోందనడానికి ఇటీవలి పరిణామాలే నిదర్శనం. ప్రముఖ రైడ్-హెయిలింగ్ సంస్థ ఉబెర్, ఓఎన్‌డీసీలో వ్యూహాత్మక పెట్టుబడులు పెట్టనున్నట్లు ఇటీవలే ప్రకటించింది. అదేవిధంగా, టెక్నాలజీ సంస్థ జోహో కార్పొరేషన్ కూడా చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు మద్దతుగా ఓఎన్‌డీసీలో రూ.70 కోట్ల పెట్టుబడి పెట్టింది. ఈ పెట్టుబడులు భారత డిజిటల్ కామర్స్ వ్యవస్థపై పెరుగుతున్న నమ్మకానికి సూచికలని ఓఎన్‌డీసీ ఇండిపెండెంట్ డైరెక్టర్ ఆదిల్ జైనుల్‌భాయ్ వ్యాఖ్యానించారు.

## ఏపీ రాజ్యసభ ఎన్నికలు ఏకగ్రీవం..

(మొదటిపేజీ తరువాయి)

పార్టీల అధిష్ఠానాలు బరిలోకి దించాయి.

టీడీపీ అభ్యర్థులుగా చింతకాయల విజయ్, భాష్యం రామకృష్ణ, సానా సతీశ్ నామినేషన్లు దాఖలు చేయగా, జనసేన తరపున లింగమనేని రమేశ్ నామినేషన్ వేశారు. ప్రత్యర్థి పార్టీల నుంచి ఎలాంటి నామినేషన్లు రాకపోగా, ఉపసంహరణ గడువు కూడా ఇవాల్టితో ముగియడంతో ఈ నలుగురు అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు ధృవీకరించారు.

## ద్రోణి ప్రభావం

(మొదటిపేజీ తరువాయి)

తెలంగాణ వరకు విస్తరించి ఉన్న ద్రోణి ప్రభావంతో ఈ వర్షాలు కురవనున్నట్లు పేర్కొంది. ఈ మేరకు ఏపీఎస్డీఎంఏ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ వివరాలు వెల్లడించారు. మార్కాపురం, రాయలసీమ జిల్లాల్లో ఉరుములతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపారు. అల్లూరి సీతారామరాజు, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో అక్కడక్కడా ఉరుములతో కూడిన తేలికపాటి జల్లులు కురిసే అవకాశం ఉందని వివరించారు. కాగా, బుధవారం సాయంత్రం శ్రీకాకుళం జిల్లా గరికిపాలెంలో 72.5 మిల్లీమీటర్లు, లావేరులో 64.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మరోవైపు, అనకాపల్లి జిల్లా మకవరపాలెం, తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరులో గరిష్ఠంగా 44.3 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయ్యింది. విశాఖపట్నం జిల్లా పెందుర్తి మండలంలో బుధవారం సాయంత్రం వీచిన ఈదురుగాలుల వల్ల పలుచోట్ల విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకొరిగాయి. దీంతో అనేక ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఈ నేపథ్యంలో, వర్ష సూచన ఉన్న ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పిడుగులు, బలమైన గాలుల పట్ల తగిన జాగ్రత్తలు వహించాలని అధికారులు సూచించారు.

## మీనాక్షి నటరాజన్ పిటిషన్‌పై విచారణకు సుప్రీంకోర్టు ఓకే..

(మొదటిపేజీ తరువాయి)

ఊరట లభించింది. ఆమె దాఖలు చేసిన పిటిషన్‌ను శుక్రవారం విచారించేందుకు అత్యున్నత న్యాయస్థానం అంగీకరించింది. అయితే ఎన్నికల ఫలితాలను తాత్కాలికంగా నిలిపివేసేలా ఆదేశాలివ్వాలన్న అభ్యర్థనను కోర్టు తిరస్కరించింది. మీనాక్షి తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ ఈ అంశాన్ని అత్యవసరంగా విచారించాలని సుప్రీం కోర్టును కోరారు. తెలంగాణలోని ఓ ప్రైవేట్ ఫిర్యాదుకు సంబంధించి ఆమెకు కేవలం నోటీసు మాత్రమే జారీ అయిందని వివరించారు. ఆ వ్యవహారంలో కోర్టు ఇంకా కేసును విచారణకు స్వీకరించలేదని, ఛార్జిషీట్ కూడా నమోదు కాలేదని తెలిపారు. దీన్ని క్రిమినల్ కేసుగా పరిగణించలేమని కాంగ్రెస్ వాదిస్తోంది. అందువల్ల నామినేషన్ పత్రాల్లో ఆ వివరాలను వెల్లడించాల్సిన అవసరం లేదని చెబుతోంది. ఎన్నికల నిబంధనల ప్రకారం కూడా ఆ దశలో సమాచారాన్ని తప్పనిసరిగా ఇవ్వాల్సిన అవసరం లేదని కోర్టు దృష్టికి సింఘ్వీ తీసుకెళ్లారు.

## నీతి ఆయోగ్ భేటీలో 'స్వర్ణాంధ్ర @2047' విజన్

(మొదటిపేజీ తరువాయి)

పారదర్శక విధానాలు, వ్యాపార అనుకూల వాతావరణం కారణంగా గత రెండేళ్లలోనే ఆంధ్రప్రదేశ్‌కు రూ.23 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చాయని ముఖ్యమంత్రి సభకు తెలియజేశారు. దీనివల్ల రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఉపాధి కల్పనతో పాటు ఆర్థిక వృద్ధికి మార్గం సుగమమైందని అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రాల మధ్య పెట్టుబడుల ఆకర్షణ కోసం అనారోగ్యకరమైన పోటీ తగదని హితవు పలికారు. కేవలం ప్రోత్సాహకాలపై ఆధారపడకుండా మౌలిక సదుపాయాల బలోపేతం, విధాన స్థిరత్వం, అనుమతుల వేగవంతం వంటి సుస్థిర అభివృద్ధి మార్గాలపై దృష్టి సారించాలని రాష్ట్రాలకు సూచించారు. సమ్మిళిత అభివృద్ధి తమ ప్రభుత్వ అజెండా అని పునరుద్ఘాటించిన చంద్రబాబు, ప్రతి కుటుంబానికి ఇల్లు, పారిశుద్ధ్యం, కుళాయి నీరు, స్వచ్ఛమైన వంట ఇంధనం, విద్యుత్, డిజిటల్ కనెక్టివిటీ, ప్రత్యక్ష నగదు బదిలీ వంటి ఏడు ప్రాథమిక అవసరాలను అందిస్తామని తెలిపారు. సమాజంలోని ఉన్నత వర్గాల్లోని 10 శాతం మంది, అట్టడుగున ఉన్న 20 శాతం మందికి అండగా నిలిచేందుకు ఉద్దేశించిన వినూత్న 'పీ4-ఎంబీకే 10-20' కార్యక్రమాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. ఆరోగ్య రంగంలో 'ప్రాజెక్ట్ సంజీవని' ద్వారా నివారణ వైద్యానికి పెద్దపీట వేస్తున్నామని, ఏఐ ఆధారిత విద్యతో భవిష్యత్ అవసరాలకు యువతను తీర్చిదిద్దుతున్నామని వివరించారు. రాష్ట్రంలో సంతానోత్పత్తి రేటు 1.5 కంటే తక్కువగా ఉన్న విషయాన్ని ప్రస్తావిస్తూ, జనాభా సుస్థిరతపై జాతీయ స్థాయిలో దృష్టి సారించాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. భవిష్యత్తులో శ్రామిక శక్తి కొరత, వృద్ధాప్య సంబంధిత సవాళ్లను ఎదుర్కొనేందుకు రాష్ట్ర జనాభా నిర్వహణ విధానాన్ని రూపొందించినట్లు తెలిపారు. సహకార సమాఖ్య స్ఫూర్తికి ఆంధ్రప్రదేశ్ కట్టుబడి ఉందని, 'వికసిత భారత్ 2047' అనే ఉమ్మడి లక్ష్యాన్ని సాధించేందుకు కేంద్ర ప్రభుత్వం, నీతి ఆయోగ్‌తో కలిసి పనిచేస్తామని హామీ ఇచ్చారు.

# అక్టోబర్‌లో మెగా డీఎస్సీ నోటిఫికేషన్

(మొదటిపేజీ తరువాయి)

**2024లో నోటిఫై చేసిన పోస్టులను భర్తీ చేయకపోవడానికి కారణం**

2024లో నోటిఫై చేసిన సుమారు 6,100 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ప్రక్రియ పూర్తికాకపోవడానికి ప్రధానంగా రెండు కారణాలు ఉన్నాయని రాష్ట్ర విద్యా శాఖ కార్యదర్శి కోన శశిధర్ తెలిపారు. సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పుల మేరకు హారిజాంటల్ రిజర్వేషన్ల అమలులో పూర్తి చట్టబద్ధత, స్పష్టత, నిబంధనల అనుసరణను నిర్ధారించాల్సిన అవసరం ఏర్పడటంతో పాటు, టెట్-డీఎస్సీ ప్రక్రియలను సమన్వయంతో నిర్వహించి అభ్యర్థులకు ఎటువంటి గందరగోళం లేకుండా పరిపాలనా సౌలభ్యాన్ని కల్పించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ రెండు అంశాల నేపథ్యంలో నియామక ప్రక్రియను అత్యంత జాగ్రత్తగా నిర్వహించాల్సి రావడంతో పోస్టుల భర్తీ ఆలస్యమైనట్లు ఆయన స్పష్టం చేశారు.

**డిఎస్సీ ప్రక్రియలో పేపర్ లీకేజీకి అవకాశమే లేదు...**

డిఎస్సీ నియామక ప్రక్రియ పూర్తిగా డిజిటల్ విధానంలో నిర్వహించబడిందని కోన శశిధర్ తెలిపారు. సిస్టమ్‌కు పరిమిత సంఖ్యలో మాత్రమే అధికారిక యాక్సెస్ ఉంటుందని, కేవలం ఇద్దరు నియమిత శాశ్వత ఉద్యోగులు మాత్రమే డేటా అప్‌లోడ్ చేసే అధికారం కలిగి ఉంటారని తెలిపారు. పాస్‌వర్డులు నిరంతరం మార్చబడుతూ ఉంటాయని, అనధికార ప్రవేశానికి అవకాశం లేదని స్పష్టం చేశారు. అందువల్ల డేటా లీకేజీ లేదా పేపర్ లీకేజీకి ఎటు వంటి అవకాశం ఉందన్నారు.

**మెరిట్ లిస్ట్ తయారీ పూర్తిగా నిబంధనల ప్రకారం...**

డిఎస్సీ ఎంపికల్లో టెట్ మార్కులకు 20 శాతం, డిఎస్సీ మార్కులకు 80 శాతం వెయిటేజీ ఇచ్చి జనరల్ మెరిట్ లిస్ట్ రూపొందించినట్లు ఆయన తెలిపారు. టెట్ మార్కులను ఇప్పటికే అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. సర్టిఫికేట్ వెరిఫికేషన్ కోసం కాల్ లెటర్ రావడం అంటే అభ్యర్థి ఎంపికైనట్లుగా కాదని ఆయన మరోసారి స్పష్టం చేశారు. హారిజాంటల్ రిజర్వేషన్లు, సర్టిఫికేట్ వెరిఫికేషన్, అర్హత నిర్ధారణ తదితర అంశాల ఆధారంగా తుది ఎంపికలు జరుగుతాయని పేర్కొన్నారు. ఒక అభ్యర్థికి కాల్ లెటర్ వచ్చినప్పటికీ, వెరిఫికేషన్ సమయంలో అనర్హత తేలితే తదుపరి అభ్యర్థికి అవకాశం దక్కవచ్చని వివరించారు.

**గ్రీవెన్స్ పరిష్కారానికి మూడు స్థాయిల వ్యవస్థ...**

అభ్యర్థుల అభ్యంతరాల పరిష్కారం కోసం ప్రభుత్వం మూడు స్థాయిల్లో గ్రీవెన్స్ మెకానిజాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. జిల్లా స్థాయి పరిశీలన, రాష్ట్ర స్థాయి కమిటీ, కమిషనర్ స్థాయి తుది పరిశీలనతో అభ్యర్థుల అభ్యంతరాల పరిష్కారించడం జరుగుచున్నదన్నారు. ఈ ప్రక్రియ ద్వారా ప్రతి ఫిర్యాదును నిష్పాక్షికంగా పరిశీలించినట్లు ఆయన వెల్లడించారు.

**స్పోర్ట్స్ కోటా నియామకాలపై పూర్తి వివరణ...**

స్పోర్ట్స్ కోటా నియామకాల విషయంలో ప్రభుత్వం అమలులో ఉన్న నిబంధనలు, జీఓల ప్రకారం పూర్తిస్థాయి పారదర్శకతతో ఎంపికలు నిర్వహించినట్లు రాష్ట్ర క్రీడల శాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి అజయ్‌జైన్ స్పష్టం చేశారు.

**ఇంటర్-కాలేజియేట్ పోటీలకు ప్రస్తుత నియామకాల్లో ప్రాధాన్యం లేదు...**

ప్రస్తుతం అమల్లో ఉన్న జీఓ ఎంఎస్ నెం.4 ప్రకారం ఇంటర్-కాలేజియేట్ పోటీల్లో పాల్గొనడం లేదా సాధించిన విజయాలను ఉద్యోగాల కోసం అర్హతగా పరిగణించలేదని ఆయన తెలిపారు. అయితే 2012 ఆగస్టు 9న జారీ చేసిన జీఓ ఎంఎస్ నెం.74 ప్రకారం నిర్వహించిన గత నియామకాలలో ఇంటర్-కాలేజియేట్ పోటీలు, ఇంటర్-డిస్ట్రిక్ట్ పోటీలు, రూరల్ స్పోర్ట్స్, మహిళా క్రీడా ఉత్సవాలు, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలు వంటి విభాగాల్లో పాల్గొనడం లేదా పతకాలు సాధించడం కూడా ఉద్యోగ అర్హతకు పరిగణనలోకి తీసుకున్నట్లు వివరించారు. అదే విధానం 2019లో గ్రామ/వార్డు సచివాలయాల ద్వారా చేపట్టిన సుమారు 1.20 లక్షల నియామకాలలో కూడా అమలులో ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు.

**జీఓ-4 ప్రకారం అత్యున్నత క్రీడా విజయాలకే ప్రాధాన్యం**

ప్రస్తుత నియామకాల్లో జాతీయ క్రీడలు (చీఫ్‌అశీఖుశ్రీ +ఖుఎవం), జాతీయ ఛాంపియన్‌షిప్‌లు, ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీలు, సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ పోటీలు, రాష్ట్రస్థాయి ఛాంపియన్‌షిప్‌లు, అంతర్జాతీయ స్థాయి పోటీలలో సాధించిన విజయాల ఆధారంగా మాత్రమే ప్రాధాన్యత కేటాయించినట్లు ఆయన తెలిపారు.

**382 మంది స్పోర్ట్స్ కోటా అభ్యర్థుల వివరాలు ఆన్‌లైన్‌లోనే ఉన్నాయి.**

డీఎస్సీ-2025 స్పోర్ట్స్ కోటా కింద మొత్తం 382 మంది అభ్యర్థులు ఎంపిక ప్రక్రియలో భాగమయ్యారని ఆయన తెలిపారు. వీరిలో 22 మంది బంగారు పతక విజేతలు, 40 మంది రజత పతక విజేతలు, 43 మంది కాంస్య పతక విజేతలు మరియు 275 మంది జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు ఉన్నారని తెలిపారు. ఖో-ఖో, బాల్ బ్యాడ్మింటన్, జూడో, సాఫ్టుబాల్, అథ్లెటిక్స్, వాలీబాల్, హ్యాండ్‌బాల్, హాకీ తదితర 34 క్రీడా విభాగాలకు చెందిన క్రీడాకారులు ఈ ఎంపికల్లో భాగమయ్యారని ఆయన తెలిపారు.

**ప్రతి సర్టిఫికేట్‌పై బహుస్థాయి ధృవీకరణ**

సమర్పించిన ప్రతి క్రీడా సర్టిఫికేట్‌ను స్క్రూటినీ కమిటీ, రాష్ట్ర స్థాయి కమిటీ, సంబంధిత క్రీడా సంఘాలు, యూనివర్సిటీలు మరియు ఇతర అధికారిక రికార్డుల ద్వారా పరిశీలించి మాత్రమే అర్హత నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. 1996 నుంచి 2025 వరకు జారీ చేసిన సర్టిఫికెట్లను కూడా ధృవీకరణలో భాగంగా పరిశీలించినట్లు వెల్లడించారు.

**దుర్గయ్య కేసుపై వివరణ...**

తూర్పు గోదావరి జిల్లాకు చెందిన అభ్యర్థి అనిగి దుర్గయ్య తనకు జాతీయ క్రీడల్లో సాధించిన విజయాలున్నప్పటికీ ఉద్యోగం రాలేదని చేసిన ఆరోపణలపై ఆయన వివరణ ఇస్తూ దుర్గయ్య 32వ నేషనల్ గేమ్స్ కు సంబంధించిన సర్టిఫికేట్‌ను ఆన్‌లైన్ దరఖాస్తు సమయంలో అప్లోడ్ చేయలేదని, భౌతిక ధృవీకరణ సమయంలో మాత్రమే ఆ వివరాలను సమర్పించినట్లు తెలిపారు. అయితే జీఓ-4 మరియు నోటిఫికేషన్ ప్రకారం నిర్దేశిత గడువులో ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేసిన సర్టిఫికెట్లను మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని స్పష్టమైన నిబంధన ఉన్నందున, అనంతరం సమర్పించిన పత్రాలను పరిగణనలోకి తీసుకోవడం సాధ్యపడలేదని ఆయన పేర్కొన్నారు. అభ్యర్థి ఆన్‌లైన్‌లో సరైన సర్టిఫికేట్‌ను సమర్పించి ఉంటే, అతని అర్హతను సంబంధిత ప్రాధాన్యత క్రమంలో పరిశీలించే అవకాశం ఉండేదని వివరించారు.

**గత నియామకాలు - ప్రస్తుత నియామకాల మధ్య తేడా...**

2019గ్రామ/వార్డు సచివాలయ నియామకాలలో ఇంటర్-కాలేజియేట్, రూరల్ స్పోర్ట్స్, ఇంటర్-డిస్ట్రిక్ట్ పార్టిసిపేషన్ వంటి కేటగిరీలను పరిగణనలోకి తీసుకుని వందలాది మందికి ఉద్యోగాలు కల్పించినప్పటికీ, ప్రస్తుత డీఎస్సీ నియామకాల్లో అమలులో ఉన్న జీఓ-4 ప్రకారం అలాంటి కేటగిరీలు పరిగణనలో లేవని ఆయన స్పష్టం చేశారు.

**క్రీడాకారులను ప్రోత్సహించడమే ప్రభుత్వ లక్ష్యం...**

స్పోర్ట్స్ కోటా ద్వారా ఉద్యోగాల కల్పన వెనుక ప్రధాన ఉద్దేశ్యం రాష్ట్రంలో క్రీడలను ప్రోత్సహించడం, ప్రతిభావంతులైన క్రీడాకారులకు అవకాశాలు కల్పించడమేనని శాప్ వైస్ చైర్మన్ ఌ మేనేజింగ్ డైరెక్టర్ భరణి తెలిపారు. క్రీడల్లో విశేష ప్రతిభ కనబరిచిన వారికి ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా మరింత మంది యువత క్రీడల వైపు ఆకర్షితులవుతారని ఆమె పేర్కొన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర విద్యా శాఖ కమిషనర్ తమీమ్ అన్సారియా పాల్గొన్నారు.

# లక్షలాది మంది జీవితాలతో ఆడుకున్నారు

(మొదటిపేజీ తరువాయి)

దగా, వెన్నుపోటు, కుంభకోణాలకు చొక్కా, ప్యాంటు వేస్తే అది చంద్రబాబు అవుతారు" అని ఆయన విమర్శించారు. లక్షలాది మంది యువత ఆశలు, భవిష్యత్తు ముడిపడి ఉన్న డీఎస్సీ వంటి ప్రక్రియలో కూడా అవినీతి, అక్రమాలకు పాల్పడటం అత్యంత దారుణమని అన్నారు.

**'మేమూ బొద్దింకలమే.. జనరేషన్ జెడ్ చూస్తోంది'**

ప్రభుత్వం చేస్తున్న అక్రమాలను జనరేషన్ జెడ్ (Gen Z) గమనిస్తోందని చంద్రబాబు గుర్తుంచుకోవాలని జగన్ హెచ్చరించారు. "చంద్రబాబూ గుర్తుంచుకో, ఇది జెన్ జెడ్. జెన్ ఆల్ఫా కూడా వస్తోంది. తప్పులు ఒప్పుకోకుండా ఇబ్బంది పెడితే బొద్దింకలు తిరగబడతాయి" అని వ్యాఖ్యానించారు. నీట్ పేపర్ లీక్ తర్వాత ఆన్‌లైన్‌లో మొదలైన 'జనతా కాక్రోచ్ పార్టీ' ఉద్యమం గురించి ప్రస్తావించగా, "ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మేం కూడా బొద్దింకలమే. యువతకు అన్యాయం జరిగితే వారు ఇలాంటి మార్గాలనే ఎంచుకుంటారు" అని జగన్ పేర్కొన్నారు.

**అక్రమాలపై జగన్ వివరణ**

డీఎస్సీ అక్రమాలపై జగన్ వివరంగా మాట్లాడుతూ.. 1995 నుంచి చంద్రబాబు పాలన లీకులు, అవినీతితోనే నిండిపోయిందన్నారు. ఈసారి డీఎస్సీ కన్వీనర్‌ను పక్కనపెట్టి, ప్రశ్నపత్రం రూపకల్పన, పరీక్షల నిర్వహణ బాధ్యతలను ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్‌కు అప్పగించారని, ఒకే అధికారి చేతిలో కీలక అధికారాలు కేంద్రీకరించి పారదర్శకతను దెబ్బతీశారని ఆరోపించారు. ప్రశ్నపత్రం ఎంతమంది చేతుల్లోకి వెళ్లింది, ఎంత డబ్బు చేతులు మారింది అనే విషయాలు థర్డ్ పార్టీ ఏజెన్సీ విచారణలోనే తేలుతాయన్నారు. స్పోర్ట్స్ కోటాలో అక్రమాలు జరిగాయంటూ జగన్ ధ్వజమెత్తారు. "స్పోర్ట్స్ కోటా అభ్యర్థులకు అర్హత పరీక్ష రాయాల్సిన అవసరం లేదని, కేవలం పార్టిసిపేషన్ సర్టిఫికేట్ ఉంటే చాలని జీవోలు ఇచ్చి తమకు కావాల్సిన వారిని ఉద్యోగాల్లోకి తీసుకున్నారు. టీడీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు ఇచ్చిన కాలేజీ, యూనివర్సిటీ, జిల్లాస్థాయి పోటీల పార్టిసిపేషన్ సర్టిఫికేట్లతో ఉద్యోగాలు ఇచ్చారు. మరోవైపు, జాతీయ క్రీడల్లో బంగారు పతకాలు సాధించి ఇంటర్వ్యూలకు పిలిపించిన నిజమైన అభ్యర్థులకు ఉద్యోగాలు రాలేదు. మొత్తం 270 మంది అర్హత పరీక్ష రాయకుండానే స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు పొందారు" అని జగన్ వివరించారు.

**సీబీఐ విచారణే శరణ్యం**

తమ హయాంలో నోటిఫికేషన్ నుంచి నియామక పత్రాలు ఇచ్చే వరకు కేవలం నాలుగు నెలల్లో 1.30 లక్షల ఉద్యోగాలను ఎలాంటి లోపాలు లేకుండా భర్తీ చేశామని జగన్ గుర్తుచేశారు. డీఎస్సీ వ్యవహారంలో చంద్రబాబు, విద్యాశాఖ మంత్రిగా ఉన్న ఆయన కుమారుడు లోకేశ్ ముద్దాయిలని, వారే తీర్పు చెబితే న్యాయం జరగదని, అందుకే సీబీఐ విచారణ డిమాండ్ చేస్తున్నామని స్పష్టం చేశారు. జూన్ 12న తలపెట్టిన 'వెన్నుపోటుకు రెండేళ్లు' నిరసన కార్యక్రమంలో ఈ డీఎస్సీ అక్రమాల అంశాన్ని ప్రముఖంగా ప్రస్తావించాలని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

# డ్రైనేజీ కార్మికులకు శిక్షణ తరగతులు

నెల్లూరు (సింధూర దర్శిని) 11 జూన్ నెల్లూరు జిల్లా ; నేషనల్ సఫాయి కర్మచారి ఫైనాన్స్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయం కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కార్మికులకు ఐదు రోజులపాటు శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నారు. శిక్షణలో నాలుగవ గురువారం కార్పొరేషన్ స్టేట్ కోఆర్డినేటర్ టి.అనిల్ కుమార్ కార్మికులకు వివిధ అంశాలపై శిక్షణ అందించి అవగాహన కల్పించారు. పారిశుద్ధ్య కార్మికుల జీవన భద్రతకు తొలి ప్రాధాన్యత కల్పిస్తూ సఫాయి మిత్ర సురక్షా ఛాలెంజ్ పథకం అమలులో భాగంగా కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను నెల్లూరు నగర పాలక సంస్థలో పటిష్టంగా అమలు చేస్తున్నారని తెలియజేసారు. విధి నిర్వహణలో కార్మికుల ప్రాణ రక్షణతో పాటు, వారి కుటుంబాల జీవన భద్రతకై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న ప్రణాళికలను వివరించారు. సఫాయి మిత్ర సురక్షా నిర్దేశకాలతో కార్పొరేషన్ కార్మికుల రక్షణ సాధ్యమవుతుందని, దైనందిన విధులలో ఆయా నిబంధనలను తప్పనిసరిగా అమలు చేయాలని సూచించారు. భూగర్భ డ్రైను కార్మికులు, డీ స్లెడ్జింగ్ ఆపరేటర్ల ద్వారా ఆధునిక మర యంత్రాల సాయంతో నగర వ్యాప్తంగా చేపడుతున్న పారిశుధ్య



నిర్వహణ పనులను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆయన సూచించారు. సఫాయి మిత్ర కార్మికులు విధి నిర్వహణలో నగర పాలక సంస్థ అందించిన యూనిఫామ్, చేతి తొడుగులు, హెల్మెట్, షూస్, మాస్క్ లను తప్పనిసరిగా వినియోగించేలా జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రమాదాల నివారణకై ప్రతి ఒక్క కార్మికునికి అవగాహన కల్పించాలని సూచించారు. భూగర్భ డ్రైను పనులలో భాగంగా మ్యాన్ హోల్స్ శుభ్రతకై యంత్రాలను మాత్రమే వినియోగించాలని సూచించారు. ప్రభుత్వం సూచించిన అన్ని రక్షణా నిబంధనలను పాటిస్తూ, స్వచ్ఛ సర్వేక్షన్ పోటీలో ఉత్తమ ర్యాంకు సాధించేందుకు కృషి చేయాలని స్టేట్ కోఆర్డినేటర్ సూచించారు. శిక్షణ తరగతులలో త్రెడ్స్ ఆర్గనైజేషన్ మేనేజర్ అంబుజీ త్రిపాఠి, భూగర్భ డ్రైనేజీ కార్మికులు పాల్గొన్నారు.

## నిరుపేద మహిళలకు ఎమ్మెల్యే ఆర్థిక సాయం



గూడూరు (సింధూర దర్శిని) 11 జూన్ నెల్లూరు జిల్లా ; నిరుపేద మహిళలకు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ ఆర్థిక సాయం అందజేసి మానవత్వం చాటుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చిల్లకూరు మండల పరిధిలోని చేడి మాల గ్రామంలో కూలి పని చేస్తున్న తన భర్త కొద్ది నెలల క్రితం తప్పిపోయారని కుటుంబ పోషణ కష్టతరంగా ఉందన్న అంకమ్మ గురువారం మండల నాయకులు దువ్వూరు రాజశేఖర్ రెడ్డి తో కలిసి క్యాంపు కార్యాలయానికి వచ్చి తెలియజేయడంతో పదివేల రూపాయలు ఆర్థిక సాయం అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెనుబోలు జానకిరామ్ రెడ్డి , చాకిర యశ్వంత్ పాల్గొన్నారు.

## కాన్వెంట్‌లకు దీటుగా అంగన్వాడి కేంద్రాలు

### ఐసిడిఎస్ సిడిపిఓ షేక్ మెహబూబి



గూడూరు ( సింధూర దర్శిని) 11 జూన్ నెల్లూరు జిల్లా ; చిన్నారులకు కాన్వెంట్లకు దీటుగా ఆటపాటలతో కూడిన విద్య బోధన అందిస్తున్నట్లు ఐసిడిఎస్ సిడిపిఓ షేక్. మెహబూబి తెలిపారు. గురువారం చిల్లకూరు అరుంధతి యవాడ, హరిజనవాడ అంగన్వాడి కేంద్రాలలో అంగన్వాడి పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఓ మాట్లాడుతూ ప్రైవేటు కాన్వెంట్లకు దీటుగా అంగన్వాడీలలో చిన్నారులకు అనుగుణంగా మానసిక వికాసం. ఉల్లాసం లక్ష్యంగా శిక్షణ పొందిన వర్కర్లచే బోధన ఉంటుందన్నారు. మూడు సంవత్సరాలు నిండిన ప్రతి చిన్నారిని అంగన్వాడి కేంద్రాలలో చేర్పించాలన్నారు. దీనికి తోడు పిల్లలకు అంగన్వాడి కేంద్రాల్లో పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. తల్లిదండ్రులతో సమావేశం అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సిడిపిఓ శారదంబ, సూపర్వైజర్ రేణుకమ్మ ,అంగన్వాడి వర్కర్లు కమలమ్మ , లక్ష్మీ ప్రసన్న, సహాయకురాలు విజయమ్మ ఆశ వర్కర్లు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## క్రీడాకారులకు పౌష్టికాహారం నగదు పంపిణీ

### లక్ష్మీ పీఎం రావు దంపతుల దాతృత్వంతో నగదు పంపిణీ



గూడూరు ( సింధూర దర్శిని) 11 జూన్ నెల్లూరు జిల్లా ; గూడూరు పట్టణంలోని డి.ఎన్.ఆర్ కమ్యూనిటీ హాల్లో రోటరీ వెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్ శ్రీలక్ష్మీ, పీఎం రావు దంపతుల దాతృత్వంతో హాకీ క్రీడాకారులకు పౌష్టికాహారం కొరకు నగదు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు విజయ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి నెల 20 మంది హాకీ క్రీడాకారులకు పౌష్టికాహారం కొరకు డాక్టర్ శ్రీలక్ష్మీ,పీఎం రావు దంపతులు నగదును పంపిణీచేయడం అభినందనీయమని తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో రొటేరియన్లు వాసు గౌడ్, కోట కృష్ణ, ఎన్ కృష్ణంరాజు, తాళ్లూరు శ్రీనివాసులు, ఎర్రమాక కృష్ణారెడ్డి,హరినాథ్ రెడ్డి, సుబ్రహ్మణ్యం, బలరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు

## అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి

### ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్



గూడూరు, (సింధూరదర్శిని) 11 జూన్ నెల్లూరు జిల్లా; పట్టణంలోనే ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ గురువారం ప్రజా దర్బార్ (గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం సమస్యలను తెలిపేందుకు వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. అనంతరం ఎమ్మెల్యే పాశం కుమార్ మాట్లాడుతూ ప్రజల నుండి వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించి, ప్రజలకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో శీలం కిరణ్ కుమార్, పులిమి శ్రీనివాసులు, దువ్వూరు రాజశేఖర్ రెడ్డి, అబ్దుల్ రహీం, మట్టం శ్రావణి రెడ్డి, పెనుబోలు జానకిరామ్ రెడ్డి, యశ్వంత్, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# రొట్టెల పండుగ ఏర్పాట్లపై మంత్రి నారాయణ సమీక్ష

**రొట్టెల పండుగ ఏర్పాట్లపై మంత్రి నారాయణ, ఎమ్మెల్యే కోటంరెడ్డి, వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అజీజ్ ముమ్మర కసరత్తు.**

**నెల్లూరు బారాషాహిద్ దర్గా రొట్టెల పండుగకు 10 కోట్లు - జూన్ 24 లోగా పనులు పూర్తి చేయాలని మంత్రి ఆదేశం**

**ఈనెల 26 నుంచి ఐదు రోజుల పాటు నెల్లూరు రోటీ ఫెస్టివల్ - దర్గా వద్ద అధికారులతో సమీక్ష**

**గత ప్రభుత్వంలో నిర్వహణ అట్టర్ ప్లాప్ - ఈసారి రొట్టెల పండుగను అంగరంగ వైభవంగా జరిపిస్తాం : మంత్రి నారాయణ**



నెల్లూరు, (సింధూరదర్శిని)11 జూన్ నెల్లూరు జిల్లా; 415 సంవత్సరాల చారిత్రక ప్రాశస్త్యం కలిగి, మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిన బారాషాహిద్ దర్గా రొట్టెల పండుగ ఏర్పాట్లను నెల్లూరురూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్,అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖామాత్యులు డాక్టర్ పొంగూరు నారాయణ పరిశీలించారు. అనంతరం దర్గా ప్రాంగణంలో మంత్రి ఆధ్వర్యంలో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈనెల 26 నుంచి ఐదు రోజుల పాటు జరగనున్న ఈ రోటీ ఫెస్టివల్‌కు దేశ, విదేశాల నుండి లక్షలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున, దర్గా సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం, వక్ఫ్ బోర్డు, మున్సిపల్ కార్పొరేషన్ నిధులతో కలిపి మొత్తం 10 కోట్లతో పనులు చేపడుతున్నట్లు మంత్రి ప్రకటించారు. ఎమ్మెల్యే కోటంరెడ్డి, వక్ఫ్ బోర్డు చైర్మన్ అజీజ్ ఆధ్వర్యంలో డిజైన్లు ఫైనలైజ్ అయి, ఇప్పటికే టెండర్లు కూడా పూర్తయిన పనులను అత్యంత నాణ్యతతో, సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. రొట్టెల పండుగకు 2014లో 4 లక్షలుగా ఉన్న భక్తుల సంఖ్య 2019 నాటికి 14 లక్షలకు చేరిందన్నారు. రొట్టెల పండుగను ఈ ఏడాది అంగరంగ వైభవంగా జరిపిస్తామని మంత్రి తెలిపారు. జూన్ 24వ తేదీలోపు ఏర్పాట్లన్నీ పూర్తి కావాలని డెడ్‌లైన్ విధించారు. ఎక్కడా తాగునీటి కొరత రాకుండా చూడాలని, మొబైల్ టాయిలెట్లతో పాటు శౌచాలయాలను నిరంతరం శుభ్రం చేస్తూ శానిటేషన్ పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు. ముఖ్యంగా పుణ్యస్నానాలు ఆచరించే ఘాట్ల వద్ద నాచు, పురుగులు లేకుండా తెల్లటి బట్టలతో క్లీన్ చేసే విధానాన్ని కొనసాగించాలని, మహిళలకు, పురుషులకు విడివిడిగా స్నానాల గదులు, కొళాయిలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఈ ఉన్నత స్థాయి సమీక్షలో నగర మేయర్ సుజాతా అశోక్, కార్పొరేషన్ కమిషనర్ నందన్, ఏఎస్పీ దీక్ష, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ మరియు వివిధ శాఖల విభాగాధిపతులు పాల్గొన్నారు.

# విజయోత్సవ బహిరంగ సభను విజయవంతం చేయాలి

### ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్



గూడూరు (సింధూరదర్శిని) 11 జూన్ నెల్లూరు జిల్లా ; తిరుపతిలో నేడు దామినీడు నందు జరగనున్న కూటమి ప్రభుత్వం రెండు సంవత్సరాల విజయోత్సవ బహిరంగ సభకు టిడిపి నాయకులు బూత్ కన్వీనర్లు అనుబంధ సంఘ సభ్యులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ కోరారు. గూడూరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కూటమి ప్రభుత్వం రెండు సంవత్సరాల విజయోత్సవ బహిరంగ సభకు గూడూరు నియోజకవర్గ జన సమీకరణ అబ్జర్వర్ చీరాల ఎమ్మెల్యే ముద్దులూరి మాలకొండయ్య విచ్చేశారు. గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్, ఘనంగా సన్మానించి స్వాగతం పలికారు. నియోజకవర్గ ముఖ్య నాయకులతో జన సమీకరణ సభ విజయవంతం పై చర్చించారు. ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ తిరుపతిలో 12వ తేదీ టిడిపి విజయోత్సవ బహిరంగ సభ ఘనంగా నిర్వహిస్తున్నారని అన్నారు. గూడూరు నియోజకవర్గం నుండి ముఖ్య నాయకులు బుద్ధి ఇంచార్జిలు, అనుబంధ సంఘ సభ్యులు పాల్గొని విజయ వంతం చేయాలని సూచించారు. పార్టీ కార్యక్రమాలను నియోజకవర్గంలో దిగ్విజయంగా పూర్తి చేస్తున్నామని ఇదే ఉత్సాహంతో పార్టీని మరింత పటిష్టం చేయాలని కోరారు. అబ్జర్వర్ చీరాల ఎమ్మెల్యే మాలకొండయ్య మాట్లాడుతూ బహిరంగ సభ విజయవంతం కు నియోజకవర్గానికి ఇచ్చిన టార్గెట్ పూర్తి చేయాలని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించి విజయం సాధించేలా నాయకులు కార్యకర్తలు కష్టపడి పని చేయాలని కోరారు. ఈ సమావేశంలో లక్ష్మీ ప్రసన్న,కిరణ్ కుమార్ ,భాస్కర్ రెడ్డి, రహీం, శ్రీనివాసులు ,వెంకటేశ్వరరాజు, ముని గిరీష్ ,మోహన్ రెడ్డి, జలీల్ దువ్వూరు రాజశేఖర్ రెడ్డి, మట్టం శ్రావణి, లీలావతి ,తదితరులు పాల్గొన్నారు

# ఫార్మర్లు అందరూ బ్రాండ్ అంబాసిడర్‌లుగా వ్యవహరించాలి

### జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల




నెల్లూరు ( సింధూర దర్శిని) 11 జూన్ నెల్లూరు జిల్లా; రైతులు తాము పండించే పంటలను మార్కెట్లో ఉన్న డిమాండును బట్టి మార్పుచేసుకొని పంటలు పండించాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. గురువారం స్థానిక యన్.జి రంగా వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో వ్యవసాయ మరియు అనుబంధ శాఖల ఆద్వర్యములో చాంపియన్ ఫార్మర్స్ తో "కిసాన్ గోష్టి "కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి చాంపియన్ ఫార్మర్ కనీసం 10 మందికి స్ఫూర్తి దాయకం కావాలని తద్వారా జిల్లాలో 7 వేల మంది చాంపియన్ ఫార్మర్లు గా తయారు కావలసిన అవసరం ఉందన్నారు. రైతులు మార్కెట్ డిమాండ్ ఆధారిత పంటల వైపు మొగ్గు చూపి తగిన రాబడి పొందాలని సూచించారు. చాంపియన్ ఫార్మర్లు వారి తోటి వారికి స్ఫూర్తి దాయకం కావాలని పిలుపినిచ్చారు. తాను జిల్లా కలెక్టర్ గా గత సెప్టెంబర్ మాసంలో వచ్చాని ఇక్కడి పరిస్థితులు ఆకళింపు చేసుకొని చాంపియన్ ఫార్మర్ లను తీసుకు రావడం జరిగిందన్నారు. మార్పు అనేడి ఇప్పటికిప్పుడు రాదనీ, దానికి మరికొంత కాలం పడుతుందన్నారు. తానూ అనేక దేశాలు తిరిగానని ఆమ్సర్ డాం చూసినప్పుడు అక్కడి వ్యవసాయ పద్దతులను చూడడం జరిగిందన్నారు. సుమారు వంద ఏకరాలను ఇద్దరు మానిటర్ చేస్తున్నారని కేవలం ఆటో మేటిక్ మరియు సాంకేతికతతో అది సాద్యం అని పేర్కొన్నారు. వ్యవసాయ రంగంలో పెట్టుబడులు పెరుగుతూ ఉంటాయన్నారు. అర్బనైజేషన్ వల్ల కొంత మేర అసౌకర్యం కలుగుతున్నదని అభిప్రాయ పడ్డారు. చాంపియన్ ఫార్మర్లు విజయాలు సాధిస్తే ఆ విజయం వారిదని అదే నష్టం వాటిల్లితే ఆ నష్టం తాము భరిస్తానని ఆయన తెలిపారు. మర్పులు, సాంకేతికతను రైతులు అలవరచుకోవాలని సూచించారు. రైతులు సమయానుకూలంగా మారవలసిన అవసరం ఉన్నదన్నారు. ఈ సందర్బంగా వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ మరియు పశు సంవర్ధక శాఖకు సంబంధించి పలువురు చాంపియన్ ఫార్మర్‌లు కృష్ణా రెడ్డి, వెంకట రత్న కుమారి, చిరంజీవి, లక్ష్మయ్య, పెంచలమ్మ, లక్ష్మి కుమారి, కాంతా రావు, యుగంధరరెడ్డి, ప్రభాకర రెడ్డి, మల్లిఖార్జున, శ్రీనివాసుల రెడ్డి, సాన కృష్ణా రెడ్డి, శంతన్ రెడ్డి,బుడ్డా కృష్ణా రెడ్డి, జస్వంత్ రెడ్డి, తదితరులు పాల్గొని వారి వారి అభిప్రాయాలను విలిబుచ్చారు. ఈ కార్యక్రమములో వ్యవశాయశాఖ అధికారి సత్యవాణి, ఉద్యాన వన శాఖ అధికారి సుబ్బారెడ్డి, పశు సంవర్ధక శాఖ అధికారి రమేష్ నాయక్ , మైక్రో ఇరిగిషన్ అధికారి పద్మ, వివధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలి

**కారుణ్య నియామకంలో డ్రైనేజీ మేస్త్రిగా విధుల కేటాయింపు**

**మున్సిపల్ కమిషనర్ వై ఓ.నందన్**



నెల్లూరు (సింధూర దర్శిని) 11 జూన్ నెల్లూరు జిల్లా; నెల్లూరు నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగంలో గ్యాంగ్ కూలిగా విధులు నిర్వహిస్తూ మరణించిన షేక్ జిలాని కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించే దిశగా కారుణ్య నియామకం ద్వారా ఆయన కుమారుడు షేక్ అలీమ్ కు డ్రైనేజీ మేస్త్రిగా విధులను కేటాయిస్తూ కమిషనర్ వై.ఓ.నందన్ ఉత్తర్వులు జారీ చేశారు. కార్పొరేషన్ కార్యాలయం కమిషనర్ ఛాంబర్ లో గురువారం కారుణ్య నియామకం పత్రాలను షేక్ అలీమ్ కమిషనర్ నుంచి అందుకున్నారు. విధుల నిర్వహణలో క్రమ శిక్షణ ప్రదర్శిస్తూ, బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని కమిషనర్ సూచించారు.

# బస్సు ప్రమాద బాధితులు సురక్షితంగా స్వస్థలాలకు చేరిక



మంత్రి ఆనం ఆదేశాలతో వేగవంతమైన చర్యలు - స్వస్థలాలకు చేరుకున్న ప్రమాద బాధితులు

కష్టకాలంలో ప్రభుత్వం చేయూత - బీహార్ ప్రమాద బాధితుల సురక్షిత రాక

బాధితుల పట్ల మానవతా దృక్పథం.. ప్రత్యేక ఏర్పాట్లతో స్వగ్రామాలకు తరలింపు

తక్షణ స్పందనతో ప్రాణాలు దక్కాయి.. ప్రభుత్వ సహాయం పై బాధితుల హర్షం

ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి ఆనంకు బాధితుల ప్రత్యేక కృతజ్ఞతలు

నెల్లూరు (సింధూరదర్శిని) 11 జూన్ నెల్లూరు జిల్లా; బీహార్ రాష్ట్రంలోని ఔరంగాబాద్ సమీపంలో జరిగిన ఘోర బస్సు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందిన నెల్లూరు జిల్లా బాధితులు సురక్షితంగా స్వస్థలాలకు చేరుకున్నారు. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆదేశాల మేరకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో బాధితులను వారి స్వగ్రామాలకు చేర్చేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

గురువారం ఉదయం నెల్లూరు హైవేలోని మెడికవర్ ఆసుపత్రి వద్దకు చేరుకున్న బీహార్ బస్సు నుండి బాధితులను స్థానిక అధికారులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సులో సంగం, ఆత్మకూరు, రాంపల్లి, దుత్తలూరు తదితర ప్రాంతాలకు తరలించారు. ఇతర ప్రాంతాలకు చెందిన బాధితులను కూడా వారి స్వస్థలాలకు సురక్షితంగా చేర్చేందుకు అవసరమైన అన్ని చర్యలు పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు.

ప్రమాద బాధితులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, అవసరమైన వైద్య సేవలు, సహాయం అందించేందుకు కట్టుబడి ఉందని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి వైద్య సహాయం, రవాణా సదుపాయాలు కల్పించడం వల్లే తాము ప్రాణాలతో బయటపడ్డామని బాధితులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కష్టకాలంలో అండగా నిలిచిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి బాధితులు, వారి కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# పేదల పాలిట సంజీవని సీఎంఆర్ఎఫ్

పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ

సిటీ నియోజకవర్గంలో రెండేళ్లలో 4 కోట్ల భారీ సాయం

పేదలకు సీఎం సహాయ నిధి కొండంత అండ

ఆర్థిక ఇబ్బందులు ఉన్నా తగ్గని సాయం

49 మందికి 32 లక్షల చెక్కులు పంపిణీ చేసిన మంత్రి నారాయణ



నెల్లూరు ( సింధూర దర్శిని) 11 జూన్ నెల్లూరు జిల్లా; ఆర్థిక ఇబ్బందులు ఉన్నా సీఎం సహాయనిధి ద్వారా పేదలకు ముఖ్యమంత్రి నిధులు మంజూరు చేస్తున్నారని, సీఎంఆర్ఎఫ్ అనేది పేదల పాలిట సంజీవిని గా పనిచేస్తోందని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ పేర్కొన్నారు. నెల్లూరు సిటీ నియోజకవర్గంలోని 49 మంది లబ్ధిదారులకు 32,17,600 విలువైన సీఎం సహాయనిధి చెక్కులను మంత్రి నారాయణ చేతులమీదుగా క్యాంపు కార్యాలయంలో గురువారం పంపిణీ చేశారు. గత రెండేళ్ల కాలంలో నియోజకవర్గంలో 433 మందికి 4,04,98,692 విలువైన చెక్కులను అందజేసి ఆదుకున్నామని మంత్రి వెల్లడించారు. పేదలకు కార్పొరేట్ వైద్యాన్ని ఉచితంగా అందించడమే లక్ష్యంగా తాము ప్రారంభించిన నారాయణ నేత్రజ్యోతి,దంత సురక్ష ద్వారా కేవలం 4 నెలల్లోనే 10 వేల మందికి వైద్య పరీక్షలు చేసి, ఐదు వేల మందికి ఉచితంగా కంటి అద్దాలు, మరో ఐదు వేల మందికి దంత పరీక్షలు నిర్వహించామని తెలిపారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధికి, సంక్షేమానికి సమాన ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను డిసెంబర్ కల్లా వంద శాతం పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్పర్సన్ తాళ్ళపాక అనూరాధ, మాజీ జెడ్పీటీసీ విజేతా రెడ్డి, టీడీపీ నగర పార్టీ అధ్యక్షులు మామిడాల మధు పాల్గొన్నారు.

# గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు

స్కానింగ్ సెంటర్లు నిబంధనలు ఉల్లంఘిస్తే

18002332447కు సమాచారం ఇవ్వండి

జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల పిలుపు



నెల్లూరు (సింధూర దర్శిని) 11 జూన్ నెల్లూరు జిల్లా ; జిల్లాలోని స్కానింగ్ సెంటర్లలో గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించినా, నిబంధనలు ఉల్లంఘించినా టోల్ ఫ్రీ నెంబరు 18002332447 కు వెంటనే ఫిర్యాదు చేయాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ప్రజలకు పిలుపునిచ్చారు. గురువారం కలెక్టరు వారి క్యాంపు కార్యాలయంలో గర్భస్త పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం (పిసి పిఎన్‌డిటి),సహాయక పునరుత్పత్తి సాంకేతికత చట్టం (ఏ ఆర్ టి) అమలుపై జిల్లాస్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్లు, ల్యాబ్‌లు అన్నీ ప్రభుత్వ నిబంధనల మేరకు పనిచేయాలన్నారు. లింగనిర్ధారణ పరీక్షలు అరికట్టేందుకు, నిర్వాహకులపై కఠిన తీసుకునేందుకు జిల్లాలో వైద్యశాలలు, స్కానింగ్ సెంటర్లపై ఆకస్మిక తనిఖీలు మరింత ముమ్మరంగా నిర్వహించాలన్నారు. స్కానింగ్ సెంటర్ల తనిఖీలలో సీనియర్ మెడికల్ ఆఫీసర్లు కూడా పాల్గొనాలని సూచించారు. స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలను తప్పక పాటించాలన్నారు. చట్టాన్ని ఉల్లంఘించి లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ కు ఫిర్యాదు చేయాలని, ఫిర్యాదు చేసిన వారి వివరాలు ఎవరికీ తెలియకుండా గోప్యంగా ఉంచుతామని కలెక్టర్ చెప్పారు. వైద్యులు, స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వి. సుజాత, డి ఐ ఓ డాక్టర్ ఏ. ఉమామహేశ్వరి, గైనకాలజిస్ట్ డాక్టర్ ఆండాళ్ భాస్కర్, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ సుబ్బారావు, డెమో కె. కనకరత్నం తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ రంగంలో ప్రైవేటీకరణ ఆపాలి

సి.ఐ.టి.యు నాయకులు




గూడూరు (సింధూర దర్శిని) 11 జూన్ నెల్లూరు జిల్లా; మున్సిపల్ రంగంలో ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలని, మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, ఏ.పీ.మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సి.ఐ.టి.యు) అనుబంధం ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా గురువారం గూడూరు మున్సిపల్ కార్యాలయం ఎదుట పారిశుధ్య కార్మికులు నిరసన ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. నాయకులు మాట్లాడుతూ 14 కీలక విభాగాలను పి.పి.పి పద్ధతిలో ప్రైవేటీకరించాలని, రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించడం సరిగా లేదని,మున్సిపాలిటీలలో జరిగే లోపాలను సరిదిద్ది,ప్రభుత్వపరంగా పౌర సేవలు నిర్వహించాలి గాని, ఈ విధులను ప్రైవేటు సంస్థలకు అప్పగించడం వల్ల దశాబ్దాల తరబడి ప్రజారోగ్యం-పర్యావరణం-పరిరక్షణకు-ఎండలు-వానలు-వరదలు-తుఫానులు-కరోనా-వంటి ప్రకృతి వైపరీత్యాలతో తమ ప్రాణాలను ఫణంగా పెట్టి పని చేస్తున్న మున్సిపల్ కార్మికులకు తీవ్రం నష్టం చేకూరుస్తూ ఉందని,అంతేగాక ప్రజలు పట్టణ ప్రజానీకానికి ప్రభుత్వం పట్ల అసంతృప్తి పెరగడానికి దారితీస్తుందని, కనుక ప్రభుత్వం ప్రైవేటీకరణ విషయంలో పునరాలోచించి ప్రజా అనుకూలమైన విదానం తీసుకురావాలని వారు డిమాండ్ చేయడం జరిగింది. అనంతరం గూడూరు ఇన్ ఛార్జ్ కమిషనర్ డి.సోమశేఖర్ కి నాయకులు వినతి పత్రం సమర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ధారా కోటేశ్వరరావు, గూడూరు సి.ఐ.టి.యు ప్రధాన కార్యదర్శి బి.వి.రమణయ్య మున్సిపల్ సంఘ సహాయ కార్యదర్శి జి.మని, భూలోక మురళి నాయకులు బి. అనిల్, యస్.సుబ్రహ్మణ్యం, ఆర్.ఆనంద్, జి.మేరీ,పి.బి. పెంచలమ్మ, ఽ.పద్మమ్మ,తదితరులు పాల్గొన్నారు.




# పదవిని బాధ్యతగా భావించాలి

పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ

మూలాపేట ధర్మరాజు స్వామి ఆలయ నూతన ట్రస్ట్ బోర్డు అభినందన సభ

ఆలయాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది

మూలాపేట ఆలయ ధ్వజస్తంభ పునరుద్ధరణకు మంత్రి నారాయణ గ్రీన్ సిగ్నల్

సమతుల్యతతోనే 11 మందితో నూతన ఆలయ కమిటీ ఏర్పాటు

భక్తులకు ఇబ్బంది లేకుండా సేవలు అందించి పదవులకు వన్నె తేవాలి

నూతన కమిటీకి మంత్రి నారాయణ దిశా నిర్దేశం

నెల్లూరు ( సింధూర దర్శిని) 11 జూన్ నెల్లూరు జిల్లా ; నెల్లూరు సిటీ నియోజకవర్గం మూలాపేటలోని శ్రీ కృష్ణ ధర్మరాజు స్వామి ఆలయ నూతన ట్రస్ట్ బోర్డు అభినందన సభలో రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ పాల్గొన్నారు .ఆలయ ప్రాంగణం వద్ద భారీగా బాణసంచా కాల్చి, మంగళ వాయిద్యాలు, పూర్ణకుంభంతో సాంప్రదాయబద్ధంగా మంత్రికి ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి నారాయణ కి అర్చకులు వేదాశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన అభినందన సభలో మంత్రి నారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలకు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, నాయీ బ్రాహ్మణ, బ్రాహ్మణ వర్గాలకు సమాన ప్రాధాన్యత ఇస్తూ, అన్ని వర్గాల సమతుల్యతతో ఈ 11మంది నూతన పాలక కమిటీని ఏర్పాటు చేసిందని తెలిపారు. ఎంతో పురాతనమైన ఈ ఆలయంలో ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి జరిగే బ్రహ్మోత్సవాలను 21రోజుల పాటు వైభవంగా నిర్వహిస్తారన్నారు. టెంపుల్ ట్రస్ట్ బోర్డు పదవి ఎంతో గౌరవ ప్రదమైనదని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసి ఈ పదవులకు వన్నె తేవాలని కమిటీ సభ్యులకు దిశా నిర్దేశం చేశారు. దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఇప్పటికే ఎన్నో ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేశారని, ఈ ఆలయ అభివృద్ధికి కూడా పాలక మండలి అంతా చర్చించి ప్రతిపాదనలు సిద్ధం చేస్తే.. తాను స్వయంగా ఆనం రామనారాయణ రెడ్డితో మాట్లాడి నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు .ధ్వజస్తంభం పునరుద్ధరణ ప్రతిపాదనపై సానుకూలంగా స్పందిస్తూ, దెబ్బతిన్న ధ్వజస్తంభం స్థానంలో కొత్తది ఏర్పాటు చేయడానికి వెంటనే నివేదిక సిద్ధం చేయాలని అక్కడే ఉన్న ఈఓను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పాలక మండలి సభ్యులు వేలూరు పెంచల్ రాజా (ఛైర్మన్), అగ్నిహోత్రం వినోద్ కుమార్, ముంగమూరు సాయి విజయ్ కుమార్, కనగలూరు సురేష్, నారాయణ బాలసుబ్రహ్మణ్యం, దాంపూరు ప్రసన్న కుమార్, వీము అమ్మణ్ణి, చిత్తుటూరు వెంకట పద్మావతి, వాసుదేవ భాగ్యలక్ష్మి, కలివేటి కామాక్షి, అరవ అమృతం తదితరులను మంత్రి నారాయణ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో మేయర్ సుజాతా అశోక్,డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్,నారాయణ విద్యాసమస్థల జీఎం వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి,మాజీ మున్సిపల్ చైర్పర్సన్ తాళ్ళపాక అనూరాధ, మాజీ జెడ్పిటిసి విజేతా రెడ్డి, డివిజన్ టీడీపీ నేతలు పాల్గొన్నారు.

# నేడు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం వద్ద సామూహిక యోగా:కలెక్టర్



నెల్లూరు (సింధూర దర్శిని) 11 జూన్ నెల్లూరు జిల్లా ; నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం వద్ద శుక్రవారం ఉదయం 6 గంటలకు సామూహిక యోగా (థీమాటిక్) కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ హిమాన్షు శుక్ల ఒక ప్రకటనలో తెలిపారు.అంతర్జాతీయ యోగా దినోత్సవం జూన్ 21ను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు యోగాంధ్ర కార్యక్రమాలను జిల్లావ్యాప్తంగా పెద్దఎత్తున చేపడుతున్నట్లు తెలిపారు. జూన్ 12న శుక్రవారం ఉదయం రెసిడెన్షియల్ అసోసియేషన్లు, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో థీమాటిక్ యోగా కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రెసిడెన్షియల్ అసోసియేషన్లు, ఎన్జీవో ఆర్గనైజేషన్లు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. 16న రామతీర్థం బీచ్ 17న స్వర్ణాల చెరువు వద్ద ప్రత్యేక పర్యాటక యోగా కార్యక్రమాలు నిర్వహిం చనున్నట్లు చెప్పారు. మానసిక ఆనందానికి, శారీరక దృఢత్వానికి యోగా ఒక దివ్యౌషధమని, ప్రజలందరూ ఈ సామూహిక యోగా కార్యక్రమంలో పెద్దఎత్తున పాల్గొని యోగాపై అవగాహన పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు.



## ప్రధమ చికిత్స కేంద్రాలు ప్రైవేట్ ఆసుపత్రుల తనిఖీ

బద్వేల్, సింధూరదర్శిని:
బద్వేల్ మండలం, మున్సిపాలిటీ పరిధిలోని నంది పల్లె, చింతలచెరువు లోని శ్రీ లక్ష్మీ, వెంకట సుధ, శశి ,అమీర్, రమణయ్య ప్రధమ చికిత్స కేంద్రాలు, పట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రి గోపాలకృష్ణ ఆసుపత్రులను తొట్టిగారిపల్లె వైద్య అధికారులు రాజేష్ కుమార్, శశివర్ధన్ రెడ్డిలు గురువారం తనిఖీలు చేశారు. జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ డిప్యూటీ జిల్లా వైద్య అధికారుల ఆదేశాల మేరకు తనిఖీలు చేయడం జరిగింది. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ, ప్రధమ చికిత్స కేంద్రాలు, ప్రధమ చికిత్స మాత్రమే చేయాలని, అనంతరం వారిని ప్రభుత్వ ఆసుపత్రులకు పంపాలన్నారు. వీరు సూది, సెలైన్ ,షుగరు, రక్త పరీక్షలు, గ్యాస్ పెట్టడం, హై యాంటీబయాటిక్ మందులు వాడకూడదన్నారు. వీటిని అతిక్రమించి వాడితే చట్టపరమైన కఠిన చర్యలతో పాటు ఆ కేంద్రాన్ని సీజ్ చేస్తామన్నారు .అలాగే ప్రైవేటు ఆసుపత్రులు రిజిస్టర్ చేసుకోవాలన్నారు. అలాగే గోపాలకృష్ణ ఆసుపత్రిని తనిఖీ చేసి, వైద్యులు గోపాలకృష్ణయ్యను వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేటర్ అధికారి బి వెంగయ్య, హెల్త్ అసిస్టెంట్లు వీరి జనార్దన్ రావు, శ్రీరామయ్యలు పాల్గొన్నారు.

## కొప్పరంలో దేవాలయ భూముల కౌలు వేలంపాట తాత్కాలిక వాయిదా

సంతమాగులూరు, సింధూరదర్శిని:
సంతమాగులూరు మండలం కొప్పరం గ్రామంలో గురువారం నిర్వహించాల్సి ఉన్న దేవాలయ భూముల కౌలు వేలంపాటను తాత్కాలికంగా వాయిదా వేసినట్లు ఎండోమెంట్స్ అధికారి చావా కోటేశ్వరరావు తెలిపారు. కొప్పరం రెవెన్యూ గ్రామ పరిధిలోని శ్రీ కోదండరామస్వామి దేవస్థానానికి చెందిన సర్వే నంబర్ 883/ఏలో 14 ఎకరాలు, సర్వే నంబర్ 719లో 0.96 సెంట్లు, అలాగే కొప్పరం గ్రామంలోని శ్రీ త్రిపురాంతకేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన సర్వే నంబర్లు 290, 430లలో ఉన్న 14.47 ఎకరాల భూములను కౌలుకు ఇవ్వడానికి బహిరంగ వేలం నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు జూన్ 11న ఉదయం 10 గంటలకు దేవస్థానం ఆవరణలో బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు ముందుగా ప్రకటించడంతో పాటు కొప్పరం పరిధిలోని గ్రామాలన్నింటిలో దండోరా ద్వారా ప్రజలకు సమాచారం అందించారు. అయితే వాతావరణ పరిస్థితుల కారణంగా గురువారం నిర్వహించాల్సిన కౌలు వేలంపాటను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు చావా కోటేశ్వరరావు వెల్లడించారు. భూముల వేలంపాటకు సంబంధించి కొత్త తేదీని త్వరలో ప్రకటించి సంబంధిత గ్రామాల రైతులకు తెలియజేస్తామని ఆయన తెలిపారు.

## ఒక నెల ఒక నియోజకవర్గం నాలుగు పర్యటనలు కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

**పోరుమామిళ్ల తాసిల్దార్ విజయ్‌కుమార్**



బద్వేల్.సింధూరదర్శిని:
బద్వేల్ నియోజకవర్గం పోరుమామిళ్ల లోని పద్మావతి కళ్యాణ మండపం లో శుక్రవారం జరగబోయే ఒక నెల ఒక నియోజకవర్గం నాలుగు పర్యటనలు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మండలంలోని అన్ని శాఖల అధికారులకు పోరుమామిళ్ల మండల తాసిల్దార్ విజయ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు ఇందులో బాగా శుక్రవారం జరగబోయే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కడప జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ , జాయింట్ కలెక్టర్ నిధిమీనా, మరియు జిల్లా అధికారులు ,బద్వేల్ ఆర్డీవో చంద్రమోహన్ లు పాల్గొంటున్నారని అందువల్ల ప్రతి మండలాధికారి తప్పనిసరిగా హాజరుకావాలని ఎవరైనా హాజరుకాకుంటే వారికి మేము బాధ్యులంకామని అంతే కాకుండా ప్రతి సమస్యను పరిష్కరించే విధంగా ఈ కార్యక్రమం జరుగుతుందని వారు తెలిపారు అంతేకాకుండా ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజలు హాజరై వారి సమస్యలు కలెక్టర్ దృష్టికి స్వచ్ఛందంగా చెప్పుకోవచ్చని వారు తెలిపారు

## బద్వేల్ ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ ఆది శ్రీకాంత్

బద్వేల్ ( కడప ప్రతినిధి) సింధూరదర్శిని:
బద్వేల్ ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ ఆది శ్రీకాంత్ నేడు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఆసుపత్రిలో వైద్య సేవలను మరింత మెరుగుపరచడంతో పాటు రోగులకు నాణ్యమైన చికిత్స అందించేందుకు కృషి చేస్తామని డాక్టర్ ఆది శ్రీకాంత్ తెలిపారు. ప్రజలకు అందుబాటులో మెరుగైన వైద్య సేవలు అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.



# చంద్రబాబు వెన్నుపోటు .. పాలనకు రెండేళ్లు




బద్వేల్ సింధూరదర్శిని: ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, అబద్ధపు వాగ్దానాలతో అధికారంలోకి వచ్చి రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న చంద్రబాబు ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించేందుకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈరోజు పోరుమామిళ్లలోని పార్టీ కార్యాలయంలో బద్వేలు నియోజకవర్గ స్థాయి సమావేశం ఘనంగా నిర్వహించబడింది. ఈ సమావేశానికి ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి గారు, ఎమ్మెల్యే డాక్టర్ సుధమ్మ గారు, నియోజకవర్గ యువ నాయకుడు మరియు రాష్ట్ర విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి దేవసాని ఆదిత్య రెడ్డి గార్లు పాల్గొని జయప్రదం చేయడం జరిగింది. నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీ అగ్ర నాయకులు, కార్యకర్తలు, మేధావులు, యువకులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమం ప్రారంభంలో నల్ల బెలూన్లు ఎగరవేసి కూటమి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, ప్రస్తుతం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రతిబింబించే విధంగా ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడిన నాయకులు, ఎన్నికల ముందు రైతులు, మహిళలు, యువత, నిరుద్యోగులు మరియు పేద ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం, అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. సూపర్ సిక్స్ పథకాలు ఒక్కటి కూడా అమలు చేయలేదు. "బాబు అంటే మోసం, మోసంఅంటేబాబు" టిడిపి మానిఫెస్టో బూటకమని అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేసి పదవులు పొందారని వైఎస్ఆర్సిపి జిల్లా ఎస్సీ అధ్యక్షులు వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.

# ఎస్ఐఆర్ వల్ల నిజమైన ఓటర్లకు లబ్ది

**బద్వేల్ నియోజకవర్గం లో 100% ఓట్లు పోలింగ్ కావడమే మా లక్ష్యం :బద్వేల్ ఆర్డీవో చంద్రమోహన్**




బద్వేల్ సింధూరదర్శిని: బద్వేల్ నియోజకవర్గం లో 2029 ఎలక్షన్లలో 100% పోలింగ్ జరగడమే మా లక్ష్యమని ఆ లక్ష్యం నెరవేరాలంటే ఎస్ ఐ ఆర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు బద్వేల్ ఆర్డీవో కార్యాలయంలో ఎస్ ఐ ఆర్ పైన బద్వేల్ మరియు గోపవరం మండలాల ఎమ్మార్వో లకు మరియు రెవిన్యూ సిబ్బందికి ,బిఎల్ఓలకు జరిగిన కార్యక్రమంలో బద్వేల్ ఆర్డీవో ముఖ్యఅతిథిగా పాల్గొని సూచనలు సలహాలు ఇవ్వడం జరిగింది అందులో భాగంగా ఎమ్మార్వోలకు ఎస్ ఐ ఆర్ వల్ల నిజమైన ఓటర్లకు లబ్ధి చేకూరుతుందని గురువారం ఆర్డిఓ చంద్రమోహన్ తెలిపారు. అంతేకాకుండా నియోజక వర్గంలో రెండు లక్షల 20వేల పైచిలుకు ఓట్లు ఉన్నాయి దీనిలో చాలా వరకు ఇప్పటికే చనిపోయిన వారిని గుర్తించామని అంతేకాకుండా బద్వేల్ నియోజకవర్గం లో ఓటు ఉండి ఇతర నియోజకవర్గాల్లో ఓటు ఉన్న లేక ఇతర నియోజకవర్గాల్లో ఓటు ఉండి ఇక్కడ ఓటు ఉన్నా ఏదైనా ఒక ఓటు మాత్రమే ఉండాలని ఎన్నికల కమిషన్ నిబంధన అని దాని ప్రకారం బి ఎల్ వో లు ప్రతి ఇంటికి వెళ్లి ఒకటికి మూడుసార్లు సవరణ చేయాలని అంతేకాకుండా రాజకీయ పార్టీలను భాగస్వాములు చేసుకొని ముందుకు సాగాలని ఎమ్మార్వోలకు రెవెన్యూ సిబ్బందికి బిఎల్ఓ లకు శిక్షణా కార్యక్రమంలో ఆయన గట్టిగా దిశ నిర్దేశం చేశారు.

ఏమైనా సమస్యలు ఉంటే నా దృష్టికి తేవాలని అంతేకానీ సొంత నిర్ణయాలతో ఓట్లను తీసివేయవద్దని తప్పుడు నిర్ణయాలు తీసుకోవద్దని అలా తీసుకున్న వారు బాధ్యత వహించాలని ఎలక్షన్ కమిషన్ ఎస్ ఐ ఆర్ మన రాష్ట్రంలో 2002 సంవత్సరంలో జరపారు అప్పటినుండి ఇప్పటివరకు జరపలేదు కాబట్టి ఇప్పుడు 2026 సంవత్సరం లో జరుగుతున్న ఎస్ ఐ ఆర్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ప్రతి ఒక్కరిని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని అన్నారు ఈ కార్యక్రమంలో గోపవరం బద్వేల్ ఎమ్మార్వోలు డీటీలు వీఆర్వోలు రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# యోగాతో సంపూర్ణ ఆరోగ్యం..

**పోలీస్ పెరేడ్ మైదానం లో యోగాంధ్ర -2026 కార్యక్రమంలో జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్**

కడప సింధూరదర్శిని:
యోగా ద్వారా.. సంపూర్ణ ఆరోగ్యం, మానసిక వికాసం, క్రమశిక్షణ, మెరుగైన జీవన విధానం అలవడుతాయని జిల్లా ఎస్పీ శ్రీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐ.పి.ఎస్ పేర్కొన్నారు. గురువారం ఉదయం పోలీస్ పెరేడ్ మైదానం లో యోగాంధ్ర -2026 కార్యక్రమానికి జిల్లా ఎస్పీ శ్రీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐ.పి.ఎస్ ముఖ్య అతిథిగా విచ్చేసి స్వయంగా యోగసనాలు వేసి సిబ్బంది లో స్ఫూర్తి నింపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ దైనందిన జీవితంలో పలురకాల ఒత్తిళ్ల కారణంగా ఎంతో మంది అనేక శారీరక, మానసిక



ఆరోగ్య రుగ్మతలను ఎదుర్కొంటున్నారన్నారు. వీటన్నింటినీ జయించి సంపూర్ణ ఆరోగ్యాన్నిచ్చే సులభతరమైన ఆరోగ్య సూత్రం యోగా మాత్రమే అన్నారు. ఆరోగ్య పరిరక్షణలో భాగంగా రోజులో కొంత సమయాన్ని వ్యాయామం, యోగా, ధ్యానం కోసం కేటాయించాలని పోలీస్ అధికారులు, సిబ్బంది కి సూచించారు. ఈ సందర్భంగా యోగా శిక్షకులకు జిల్లా పోలీస్ శాఖ తరపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమం లో అడిషనల్ ఎస్పీ (ఎ.ఆర్ ) శ్రీ బి. రమణయ్య , స్పెషల్ బ్రాంచ్ డి.ఎస్పీ శ్రీ ఎన్. సుధాకర్ కడప ఇంచార్జ్ డి.ఎస్పీ ఇ. బాలస్వామి రెడ్డి, ఆర్.ఐ లు, కడప నగరంలోని సి.ఐ లు, ఎస్.ఐ లు, ఆర్.ఎస్.ఐ లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వాసుపత్రి ప్రజల ఆసుపత్రిగా మారాలి: ఎమ్మెల్యే అంజిబాబు

**రోగుల పట్ల ప్రేమ, ఆదరణ చూపించాలి - పేద ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకాన్ని పెంచాలి**

**ఏరియా ఆసుపత్రి అభివృద్ధికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలి**

భీమవరం, సింధూరదర్శిని: భీమవరం ఏరియా ఆసుపత్రి పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే ప్రజల ఆసుపత్రిగా ఎదగాలని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. గురువారం జరిగిన ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల వైద్యులు, సిబ్బంది ప్రేమ, ఆదరణ, కరుణతో వ్యవహరించాలని సూచించారు. కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వాసుపత్రిలో కూడా నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్నారు. రోగులను ఇతర ఆసుపత్రులకు పంపించే పరిస్థితులు తలెత్తకుండా అవసరమైన సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆసుపత్రి అభివృద్ధికి కమిటీ సభ్యులు సమిష్టిగా కృషి చేయాలని, సమస్యలను కమిటీ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చర్యలు చేపడతామని తెలిపారు. రాత్రి




వేళల్లో భద్రతా సమస్యలు లేకుండా ఇద్దరు కానిస్టేబుళ్లను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. వైద్యుల కొరతను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అవసరమైన నియామకాలు చేపట్టేలా కృషి చేస్తామని చెప్పారు.

అనంతరం ఆసుపత్రి అభివృద్ధికి సంబంధించిన తొమ్మిది అంశాలపై కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. సమావేశంలో కమిటీ డైరెక్టర్లు యర్రంశెట్టి శివకృష్ణ, సుంకర దాసు, డార్కే రాణి, సుప్రీం లక్ష్మణ్ జీతానంద్, ఎం. గోవింద్ బాబు, వైద్యులు పాల్గొన్నారు.

# దమ్ముంటే 12 వైఫల్యాలపై జవాబివ్వండి

బీజేపీపై వైఎస్ షర్మిల ఫైర్

రాజ్యసభ సీటు అంశంపై బీజేపీ అనవసరంగా స్పందిస్తోందని విమర్శ

కేంద్ర ప్రభుత్వ 12 వైఫల్యాలపై సమాధానం చెప్పే దమ్ము బీజేపీకి ఉందా అని ప్రశ్న

ధరల పెరుగుదల, నిరుద్యోగం, మహిళల భద్రతపై కేంద్రాన్ని నిలదీత

లక్షల కోట్ల అప్పులపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్

విభజన రాజకీయాలు చేసే బీజేపీకి ప్రజాభిమానం ఉండదని వ్యాఖ్య



సింధూరదర్శిని: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీపై ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాజ్యసభ సీటు గురించి బీజేపీ నేతలు చేస్తున్న విమర్శలను తిప్పికొడుతూ, కేంద్ర ప్రభుత్వ 12 ఏళ్ల వైఫల్యాలపై సమాధానం చెప్పే దమ్ముందా అని సవాల్ విసిరారు. ఈ మేరకు ఆమె గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాజ్యసభ సీటు అనేది మాట ఇచ్చిన వారికి, తీసుకున్న వారికి సంబంధించిన వ్యక్తిగత విషయమని, మధ్యలో బీజేపీ నేతల అసహనం, అతి స్పందన ఎందుకని షర్మిల ప్రశ్నించారు. తాము ప్రజా సమస్యలపై, ప్రభుత్వ వైఫల్యాలపై నిలదీస్తుంటే, సమాధానం చెప్పలేక అర్థం పర్థం లేని అంశాలను తెరపైకి తెచ్చి బీజేపీ తన సంస్కారాన్ని బయటపెట్టుకుంటోందని విమర్శించారు. నిజంగా చిత్తశుద్ధి ఉంటే, కాంగ్రెస్ పార్టీ లేవనెత్తిన 12 వైఫల్యాలపై చర్చకు రావాలని, పుండు మీద కారం చల్లే చేష్టలు మానుకోవాలని హితవు పలికారు. కేంద్ర ప్రభుత్వ పాలనపై షర్మిల ప్రశ్నల వర్షం కురిపించారు. “రైళ్లు, రహదారులు అని గొప్పలు చెప్పడం కాదు, నిత్యావసరాల ధరలు 300 శాతం ఎందుకు పెరిగాయో చెప్పాలి. అతిపెద్ద స్టార్టప్ దేశమని చెప్పుకోవడం కాదు, ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఎందుకు ఇవ్వలేకపోయారో సమాధానం చెప్పాలి. డీబీటీల గురించి కాదు, దేశవ్యాప్తంగా 28 సార్లు జరిగిన పేపర్ లీకుల గురించి మాట్లాడాలి. మహిళా సాధికారిత అని సమర్థించుకోవడం కాదు, ఏటా జరుగుతున్న 5 లక్షల అఘాయిత్యాలపై జవాబివ్వాలి” అని ఆమె నిలదీశారు. అంతేకాకుండా, దేశ ఆర్థిక పరిస్థితిపైనా షర్మిల తీవ్ర విమర్శలు చేశారు. “తెచ్చిన లక్షల కోట్ల అప్పులు ఎక్కడ ఖర్చు చేశారో శ్వేతపత్రం ఇవ్వాలి. దేశీయ ఆర్థిక వృద్ధి మెరుగ్గా ఉంటే, డాలర్‌తో రూపాయి విలువ రెండింతలు ఎందుకు పతనమైంది? పీఎం కిసాన్ నిధులతో రైతులను ఆదుకుంటే, ఏటా 12 వేల మంది రైతులు ఎందుకు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు?” అని ఆమె ప్రశ్నించారు. విభజన రాజకీయాల గురించి బీజేపీ మాట్లాడటం ‘దెయ్యాలు వేదాలు వల్లించినట్టు’ ఉందని షర్మిల ఎద్దేవా చేశారు. మతాల మధ్య చిచ్చు పెట్టి, ఓటు బ్యాంకు రాజకీయాలు చేసేది ఎవరో దేశ ప్రజలందరికీ తెలుసన్నారు. ఎన్నికల కమిషన్ వంటి రాజ్యాంగ సంస్థలను కీలుబొమ్మలుగా మార్చుకుని, ఓట్లు, సీట్ల చోరీకి పాల్పడుతున్నంత కాలం బీజేపీకి ప్రజాభిమానం లభించదని, వారికి దక్కేవి దొంగ సర్టిఫికెట్లు మాత్రమేనని ఆమె తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర అభివృద్ధికి కాంగ్రెస్ అంకితభావంతో ఉందని, ప్రజా ఉద్యమ గొంతుక తమదేనని షర్మిల స్పష్టం చేశారు.

# ఏపీ లిక్కర్ స్కామ్.. రాజ్ కెసిరెడ్డి మరోసారి అరెస్ట్

- తెలుగు రాష్ట్రాల్లో పలు చోట్ల ఈడీ దాడులు
- మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు నివాసం, కార్యాలయాల్లో కూడా సోదాలు
- విచారణను వేగవంతం చేసిన ఈడీ
- 'ఏపీ లిక్కర్ స్కామ్' కేసులో ప్రధాన నిందితుడు రాజ్ కెసిరెడ్డిని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అరెస్ట్ చేసింది.



అమరావతి, సింధూరదర్శిని: ఈ అరెస్టుకు ముందు తెలుగు రాష్ట్రాల్లోని పలువురు ప్రముఖుల ఇళ్లు, కార్యాలయాలపై ఈడీ ఏకకాలంలో భారీ దాడులు నిర్వహించింది. రాజ్ కెసిరెడ్డితో పాటు మరో ఆరుగురు కీలక వ్యక్తుల నివాసాల్లో సోదాలు చేసింది. వీటిలో ఏపీఎస్‌బీసీఎల్ మాజీ మేనేజింగ్ డైరెక్టర్ డి. వాసుదేవ రెడ్డి, ఆయన బంధువు నరసింహారెడ్డి, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు తదితరులకు చెందిన కార్యాలయాలు, నివాస ప్రాంగణాలు ఉన్నాయి. ఈ స్కామ్‌కు సంబంధించి ఈడీ నమోదు చేసిన ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్ (ఈసీఐఆర్) లో మొత్తం 33 మందిని నిందితులుగా చేర్చారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ భారీ మద్యం కుంభకోణం జరిగినట్లు ఈడీ ప్రాథమిక ఆధారాలు సేకరించింది. డిస్టిలరీలు, మద్యం సరఫరాదారుల నుంచి వేల కోట్ల రూపాయలను లంచాల రూపంలో అక్రమంగా వసూలు చేశారని ఈడీ స్పష్టం చేసింది. దాదాపు రూ. 3,200కోట్ల రూపాయలను లంచాల రూపంలో వసూలు చేసి, వాటిని పట్టుబడకుండా ఉండేందుకు పలు నకిలీ, షెల్ కంపెనీల ద్వారా చేతులు మార్చారని ఈడీ గుర్తించింది. ఈ మద్యం సిండికేట్ వెనుక ఉన్న అసలు దొంగలు ఎవరు? ఈ వేల కోట్ల రూపాయల హవాలా డబ్బు చివరికి ఎవరి జేబుల్లోకి వెళ్ళింది? అనే కోణంలో ఈడీ విచారణను మరింత వేగవంతం చేసింది.

# మంత్రి లోకేశ్ ఓఎస్డీకి ఎస్వీయూ నుంచి రెండు స్వర్ణ పతకాలు

- మంత్రి నారా లోకేశ్ ఓఎస్డీ డాక్టర్ వరప్రసాద్‌కు రెండు స్వర్ణ పతకాలు
- ఆర్థిక శాస్త్రంలో పీహెచ్‌డీ పరిశోధనకు ఎస్వీ యూనివర్సిటీ పురస్కారం
- డా. మన్మోహన్ సింగ్, ప్రొ. డీఎల్ నారాయణ పేర్లతో ఉన్న పతకాల ప్రదానం
- గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా అవార్డులు అందుకున్న వరప్రసాద్



తిరుపతి, సింధూరదర్శిని: ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ వద్ద ప్రత్యేక అధికారిగా (ఓఎస్డీ) పనిచేస్తున్న డాక్టర్ కాశిరెడ్డి వరప్రసాద్ అరుదైన విద్యావిషయక గౌరవాన్ని అందుకున్నారు. ఆర్థిక శాస్త్రంలో ఆయన చేసిన పీహెచ్‌డీ పరిశోధనకు గాను తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం (ఎస్వీయూ) ఆయనకు రెండు స్వర్ణ పతకాలను ప్రదానం చేసింది. ఎస్వీయూలో జరిగిన 63 నుంచి 68వ ఉమ్మడి స్నాతకోత్సవ వేడుకల్లో రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా డాక్టర్ వరప్రసాద్ ఈ పతకాలను అందుకున్నారు. ఆయనకు ‘డాక్టర్ మన్మోహన్ సింగ్ గోల్డ్ మెడల్’తో పాటు ‘ప్రొఫెసర్ డీఎల్ నారాయణ మెమోరియల్ పీహెచ్‌డీ గోల్డ్ మెడల్’ లభించాయి. పట్టణ ప్రాంతాల్లో రోడ్లు, నీటి సరఫరా వంటి మౌలిక సదుపాయాల కల్పనకు మున్సిపల్ బాండ్ల ద్వారా నిధుల సమీకరణపై ఆయన తన పరిశోధన సాగించారు. ఈ విధానాన్ని అటు ప్రభుత్వాలకు, ఇటు పెట్టుబడిదారులకు లాభదాయకంగా మార్చేందుకు అవసరమైన విధానపరమైన మార్పులను తన సిద్ధాంత గ్రంథంలో కూలంకషంగా విశ్లేషించారు. డాక్టర్ వరప్రసాద్ ప్రస్తుతం రాష్ట్ర ఆర్థికశాఖలో సెక్షన్ ఆఫీసర్‌గా సేవలందిస్తూనే, డిప్యూటేషన్‌పై మంత్రి నారా లోకేశ్ వద్ద ఓఎస్డీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. 2014-19 మధ్యకాలంలో ముఖ్యమంత్రి కార్యాలయం లో (సీఎంఓ) పనిచేసిన ఆయన, ప్రభుత్వ ఆర్థిక వ్యవహారాలు, బడ్జెట్ రూపకల్పన వంటి అంశాల్లో నిపుణుడిగా పేరుగాంచారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర అప్పులకు సంబంధించిన గణాంకాలపై మీడియా లో వచ్చిన కథనాల నేపథ్యంలో ఆయన సస్పెన్షన్‌కు గురయ్యారు. తదుపరి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత ఆయన తిరిగి విధుల్లో చేరడం గమనార్హం.

# కవిత కొత్త పార్టీకి పేరు చిక్కులు.. ‘టీఆర్ఎస్’పై ముప్పేట దాడి

కవిత కొత్త పార్టీ ‘తెలంగాణ రక్షణ సేన’కు పేరు చిక్కులు – ‘టీఆర్ఎస్’ పేరు తమదేనంటూ అభ్యంతరం వ్యక్తం చేసిన బీఆర్ఎస్

మహారాష్ట్రకు చెందిన ఓ పార్టీ కూడా అదే పేరు కోసం దరఖాస్తు – కవిత పార్టీ పేరుపై ఈసీకి వందలాది ప్రజా అభ్యంతరాలు

వివరణ ఇచ్చేందుకు ఎన్నికల సంఘాన్ని కలవనున్న కవిత ప్రతినిధులు





హైదరాబాద్, సింధూరదర్శిని: కవిత ప్రతిపాదించిన కొత్త రాజకీయ పార్టీ ‘తెలంగాణ రక్షణ సేన’ (టీఆర్ఎస్)కు ఆరంభంలోనే అడ్డంకులు ఎదురవుతున్నాయి. పార్టీ పేరు చుట్టూ తీవ్ర వివాదం నెలకొనడంతో, ఈ అంశం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ‘టీఆర్ఎస్’ అనే పేరును ఇతరులకు కేటాయించవద్దంటూ కేంద్ర ఎన్నికల సంఘానికి (ఈసీఐ) పలు వైపుల నుంచి అభ్యంతరాలు వెల్లువెత్తాయి. ఈ వివాదంలో ప్రధానంగా భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ‘టీఆర్ఎస్’ అనే పేరు 14 ఏళ్ల తెలంగాణ ఉద్యమ చరిత్రతో, ప్రజల భావోద్వేగాలతో ముడిపడి ఉందని పేర్కొంది. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ తమ పార్టీని ప్రజలు ‘టీఆర్ఎస్’గానే గుర్తిస్తున్నారని, కాబట్టి ఆ పేరును వేరొకరికి కేటాయించవద్దని కోరుతూ ఈసీకి అధికారికంగా ఫిర్యాదు చేసింది. మరోవైపు, కవిత పార్టీ ప్రకటనకు ఒక రోజు ముందే మహారాష్ట్ర సోలాపూర్‌కు చెందిన ‘తెలంగాణ రాష్ట్రసామాజిక సేన’ అనే సంస్థ కూడా ‘టీఆర్ఎస్’ అనే పేరు కోసం ఈసీకి దరఖాస్తు చేసుకోవడం గమనార్హం. సోలాపూర్‌కు చెందిన దయానంద్ మహాదేవ్ మామ్‌డ్యాల్ ఈ మేరకు దరఖాస్తు చేసినట్లు తెలియవచ్చింది. ఇవి మాత్రమే కాకుండా, కవిత పత్రికల్లో ఇచ్చిన ప్రకటన ఆధారంగా సుమారు 600 నుంచి 700 వరకు ప్రజా అభ్యంతరాలు ఈసీకి అందినట్లు సమాచారం. అదే సమయంలో, రాష్ట్ర ఎన్నికల సంఘం వద్ద ఇప్పటికే ‘తెలంగాణ రాజ్య సమితి’ పేరుతో నమోదైన మరో పార్టీ కూడా ‘టీఆర్ఎస్’ అనే సంక్షిప్త నామాన్ని వాడటంపై అభ్యంతరం తెలుపుతూ ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించింది. ఈ పరిణామాల నేపథ్యంలో, తమ వాదనలు వినిపించేందుకు కవిత ప్రతినిధుల బృందం త్వరలో ఎన్నికల సంఘాన్ని కలిసేందుకు సిద్ధమవుతోంది. ఒకే పేరుపై ఇన్ని వైపుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్న తరుణంలో కవిత తన కొత్త పార్టీకి ‘టీఆర్ఎస్’ పేరును దక్కించుకుంటారా లేదా అన్నది ఇప్పుడు తీవ్ర ఉత్కంఠ రేపుతోంది.

# అత్యధిక వేడి ముప్పున్న ప్రపంచ టాప్-30 నగరాల్లో హైదరాబాద్!

ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ అధ్యయనంలో వెల్లడి – వేగంగా పెరిగిన నగరీకరణ, పచ్చదనం తగ్గడమే ప్రధాన కారణాలు

ఈ వేసవిలో రికార్డు స్థాయిలో 47 రోజులు 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు

భారత్ నుంచి 14 నగరాలకు అధిక ఉష్ణ ముప్పు ఉందన్న నివేదిక



హైదరాబాద్, సింధూరదర్శిని: ప్రపంచంలో అత్యధిక ఉష్ణోగ్రతల ముప్పును ఎదుర్కొంటున్న నగరాల జాబితాలో హైదరాబాద్ కూడా చేరింది. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ తాజాగా వెల్లడించిన ఒక అధ్యయనం ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ఉష్ణ ప్రమాదాలు పొంచి ఉన్న 30 నగరాలలో హైదరాబాద్ ఒకటిగా నిలిచింది. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో వేగవంతమైన పట్టణీకరణ వల్ల తలెత్తుతున్న పర్యావరణ ముప్పులకు ఈ నివేదిక అద్దం పడుతోంది. ‘మూవింగ్ బియాండ్ ఎక్స్‌పోజర్’ పేరిట ప్రపంచవ్యాప్తంగా 205 ప్రధాన నగరాలపై ఈ పరిశోధన నిర్వహించారు. కేవలం గరిష్ఠ ఉష్ణోగ్రతలు కాకుండా, నగరాల్లోని కూలింగ్ సదుపాయాలు, పచ్చదనం, సామాజిక-ఆర్థిక పరిస్థితులు వంటి వివిధ అంశాలను ప్రాతిపదికగా తీసుకుని ఈ నివేదికను రూపొందించారు. ఒక కోటికి పైగా జనాభా కలిగిన హైదరాబాద్ నగరానికి ‘హీట్ వల్నరబిలిటీ ఇండెక్స్’లో 0.68 స్కోర్ లభించింది. ఈ జాబితాలో కైరో, మనీలా వంటి అంతర్జాతీయ నగరాల సరసన హైదరాబాద్ నిలిచింది. భారత్‌లోని అహ్మదాబాద్, నాగ్‌పూర్, మదురై నగరాల్లో హైదరాబాద్ కంటే ఎక్కువ ముప్పు ఉన్నట్టు ఈ నివేదిక స్పష్టం చేసింది. కాగా ముంబై, బెంగళూరు, చెన్నై, ఢిల్లీ వంటి నగరాల పరిస్థితి కాస్త మెరుగ్గా ఉన్నట్లు వెల్లడైంది. ప్రపంచవ్యాప్తంగా అత్యధిక ఉష్ణ ముప్పును ఎదుర్కొంటున్న టాప్-50 నగరాల్లో 14 భారత్‌కు చెందినవే కావడం గమనార్హం. ఈ ఏడాది వేసవిలో హైదరాబాద్ నగరం గత దశాబ్ద కాలంలో ఎన్నడూ లేనంతటి తీవ్రమైన ఎండలను చవిచూసింది. ఏప్రిల్ 1 నుంచి జూన్ 5 మధ్యకాలంలో సుమారు 47 రోజులు పాటు ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల సెల్సియస్‌ను దాటాయి. నగరం వేగంగా విస్తరించడం, పచ్చదనం క్షీణించడం, తగ్గిన కూలింగ్ సదుపాయాలు అందరికీ అందుబాటులో లేకపోవడం వంటి కారణాలు ఈ ముప్పును మరింత తీవ్రం చేస్తున్నాయని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో నగరాలు తక్షణమే స్పందించి పచ్చదనాన్ని పెంచాలని, అందరికీ అందుబాటులో ఉండేలా కూలింగ్ సదుపాయాలను మెరుగుపరచాలని ఈ అధ్యయనం సూచిస్తోంది.

# నిరుద్యోగం, పేపర్ లీక్‌లపై కాంగ్రెస్ పోరుబాట.. నెలాఖరు నుంచి దేశవ్యాప్త ఆందోళనలు

ఈ నెలాఖరు నుంచి కాంగ్రెస్ ఆందోళనలు

నిరుద్యోగం, పేపర్ లీక్‌లే ప్రధాన అస్త్రం

ధరల పెరుగుదల పట్ల కేంద్రంపై విమర్శలు

ఉద్యమం 2-3 నెలలు కొనసాగే అవకాశం

మీనాక్షి అంశంపైనా పోరాటానికి నిర్ణయం




నిరుద్యోగం, పేపర్ లీక్‌లు, ధరల పెరుగుదల వంటి అంశాలపై కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయాలని కాంగ్రెస్ నిర్ణయించింది. ఈ నెలాఖరు నుంచి దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టనున్నట్లు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి కే.సి. వేణుగోపాల్ ప్రకటించారు. ఈ కార్యక్రమాలు రెండు నుంచి మూడు నెలలపాటు కొనసాగే అవకాశం ఉందని తెలిపారు. దేశంలోని అన్ని రాష్ట్రాల కాంగ్రెస్ అధ్యక్షులు, ఇన్‌ఛార్జ్‌లు, ప్రధాన కార్యదర్శులతో జరిగిన సమావేశంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై చర్చించారు. నిరుద్యోగం పెరగడం, వరుసగా పేపర్ లీక్‌లు జరగడం, నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరగడం వంటి అంశాలు ప్రధానంగా చర్చకు వచ్చాయని వేణుగోపాల్ చెప్పారు. ప్రజలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కాంగ్రెస్ ఆరోపించింది. పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ ధరలు పెరుగుతూనే ఉన్నాయని విమర్శించింది. మరోవైపు ఉద్యోగావకాశాలు తగ్గిపోవడంతో యువత భవిష్యత్తుపై ఆందోళన చెందుతోందని పేర్కొంది. చిన్న, మధ్య తరహా పరిశ్రమల పరిస్థితి కూడా దెబ్బతిందని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక విధానాల వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. ఈ అంశాలన్నింటినీ ప్రజల్లోకి తీసుకెళ్లాలని సమావేశంలో నిర్ణయించినట్లు తెలిపారు. అలాగే మధ్యప్రదేశ్ రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ అంశంపైనా సమావేశంలో చర్చ జరిగింది. ఈ వ్యవహారంపై న్యాయపరంగా, రాజకీయంగా పోరాడాలని పార్టీ నిర్ణయించినట్లు వేణుగోపాల్ వెల్లడించారు.



## షుగర్‌ను పెంచేది ఆహారమా.. తినే టైమా?

**కార్బ్స్‌కు సమయం కీలకం**

**ఉదయం జీర్ణక్రియ వేగంగా ఉంటుంది**

**రాత్రి షుగర్ స్పైక్స్ ఎక్కువ**

**ప్రీడయాబెటిస్ ప్రమాదం పెరుగుతుంది**

**త్వరగా డిన్నర్ చేయడం మంచిది**

**ప్రోటీన్, ఫైబర్‌తో కలిపి తినాలి**

ఉదయం తిన్న అన్నం శక్తినిస్తే.. రాత్రి తిన్న అదే అన్నం సమస్యలు తెచ్చిపెడుతుందని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. శరీరంలో పనిచేసే జీవ గడియారం కారణంగా కార్బోహైడ్రేట్ల ప్రభావం సమయాన్ని బట్టి మారుతుంది. అందుకే ఉదయం 8 గంటలకు తిన్న ఆహారాన్ని శరీరం సులభంగా జీర్ణం చేసుకోగలిగితే, రాత్రి 8 గంటలకు అదే ఆహారం రక్తంలో చక్కెర స్థాయులను పెంచే అవకాశం ఉంటుంది. షుగర్‌కు దగ్గరగా వచ్చిన కోట్లాది మందికి ఇది చాలా కీలక విషయం.

**జీవగడియారం ప్రభావం**

మన శరీరంలో సర్కేడియన్ రిథమ్ అనే జీవ గడియారం పనిచేస్తుంది. ఇది నిద్ర, మేల్కొనే సమయంతో పాటు జీవక్రియలను కూడా నియంత్రిస్తుంది. ఉదయం శరీరం చురుగ్గా ఉండటంతో ఇన్సులిన్ సమర్థంగా పనిచేస్తుంది. ఫలితంగా కార్బోహైడ్రేట్ల నుంచి విడుదలయ్యే గ్లూకోజ్‌ను కణాలు సులభంగా వినియోగించుకుంటాయి. అందుకే ఉదయం తిన్న ఆహారం శక్తిగా మారే అవకాశం ఎక్కువ.

**రాత్రి ఎందుకు ప్రమాదం?**

రాత్రి సమయానికి జీవక్రియలు సహజంగానే మందగిస్తాయి. ఇన్సులిన్ ప్రభావం కూడా తగ్గుతుంది. ఈ సమయంలో ఎక్కువ కార్బోహైడ్రేట్లు తీసుకుంటే రక్తంలో చక్కెర స్థాయులు వేగంగా పెరగొచ్చు. శరీర కదలికలు తక్కువగా ఉండటం వల్ల అదనపు గ్లూకోజ్ కొవ్వుగా నిల్వ అయ్యే అవకాశం కూడా ఉంటుంది. దీర్ఘకాలంలో ఇది ప్రీడయాబెటిస్, టైప్-2 దయాబెటిస్ ప్రమాదాన్ని పెంచుతుంది.

**పరిశోధనలు చెప్పిందే**

పలు అధ్యయనాల ప్రకారం ఉదయం తీసుకున్న కార్బోహైడ్రేట్లకు శరీరం మెరుగ్గా స్పందిస్తుంది. అదే ఆహారాన్ని రాత్రి తీసుకుంటే రక్తంలో చక్కెర స్థాయులు ఎక్కువగా పెరుగుతున్నట్లు గుర్తించారు. ముఖ్యంగా ప్రీడయాబెటిస్ ఉన్నవారు భోజన సమయాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని నిపుణులు సూచిస్తున్నారు.

**పాటించాల్సిన చిట్కాలు**

కార్బోహైడ్రేట్లు పూర్తిగా మానేయాల్సిన అవసరం లేదు. అయితే వాటిని ఉదయం నుంచి మధ్యాహ్నం మధ్య తీసుకోవడం మంచిది. రాత్రి భోజనం 7 నుంచి 8 గంటలలోపు ముగించాలి. అలాగే కార్బోహైడ్రేట్లతో పాటు ప్రొటీన్, ఫైబర్ ఉండే ఆహారం తీసుకుంటే రక్తంలో చక్కెర ఒక్కసారిగా పెరగకుండా నియంత్రించవచ్చు. క్రమబద్ధమైన భోజన సమయాలు కూడా ఆరోగ్యాన్ని కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయి.

## అభిషేక్ కావాలా.. లేక మేమా?..

### మమతా బెనర్జీకి ఎంపీ కల్యాణ్ బెనర్జీ అల్టిమేటం!


-అభిషేక్‌పై కల్యాణ్ బెనర్జీ తీవ్ర విమర్శలు

-ఆయన అహంకారమే పార్టీకి నష్టం అన్న ఎంపీ

-తనను అవమానించారని ఆరోపణ

-మమత నిర్ణయం తీసుకోవాలన్న కల్యాణ్

-అభిషేక్ లేకుండా పార్టీ నడవదంటే రాజీనామా హెచ్చరిక



తృణమూల్ కాంగ్రెస్‌లో విభేదాలు మరింత ముదురుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. పార్టీ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీపై టీఎంసీ ఎంపీ కల్యాణ్ బెనర్జీ తీవ్ర విమర్శలు చేశారు. అభిషేక్ అహంకారం, ప్రవర్తనే పార్టీకి నష్టం తెచ్చిందని ఆరోపించారు. అవసరమైతే పార్టీని కూడా వీడేందుకు సిద్ధమని స్పష్టం చేశారు. మమతా బెనర్జీకి కల్యాణ్ అత్యంత సన్నిహితుడిగా పేరుంది. ఓ కేసు విషయంలో తనను సంప్రదించకుండా మరో పిటిషన్ దాఖలు చేయడంపై కల్యాణ్ బెనర్జీ ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను ఇప్పటికే కోర్టులో వాదనలు వినిపించేందుకు సిద్ధమవుతున్న సమయంలో, మరో న్యాయవాదిని రంగంలోకి దించారని చెప్పారు. ఈ విషయాన్ని తనకు ముందుగా తెలియజేయలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. తాను రాత్రి వరకు కేసుకు సిద్ధమయ్యానని, కానీ చివరి నిమిషంలో తన సేవలు అవసరం లేదని సమాచారం వచ్చిందని తెలిపారు. తన వద్ద జూనియర్లుగా పనిచేసిన న్యాయవాదులనే ఇప్పుడు తన స్థానంలో నియమించడం అవమానకరమని వ్యాఖ్యానించారు. ఓ సీనియర్ న్యాయవాదికి ఇవ్వాల్సిన గౌరవం ఇదేనా అని ప్రశ్నించారు. అభిషేక్ బెనర్జీ తనను తాను రాజులా భావిస్తున్నారని కల్యాణ్ బెనర్జీ విమర్శించారు. పార్టీ కష్టకాలంలో తాను మమతా బెనర్జీ వెంటే నిలిచానని గుర్తు చేశారు. కానీ ఇప్పుడు అభిషేక్ వైఖరి వల్ల పార్టీ తీవ్రంగా దెబ్బతింటోందని ఆరోపించారు. ఈ పరిస్థితుల్లో పార్టీ అధినేత మమతా బెనర్జీ నిర్ణయం తీసుకోవాల్సిన సమయం వచ్చిందని అన్నారు. తాను ఇప్పటికీ ఆమెకు మద్దతుగానే ఉన్నానని స్పష్టం చేశారు. అయితే అభిషేక్ లేకుండా పార్టీ ముందుకు సాగలేదని మమత భావిస్తే తాను పార్టీ నుంచి తప్పుకొంటానని హెచ్చరించారు. ఎవరు కావాలో తేల్చుకోవాలంటూ దీదీకి అల్టిమేటం జారీ చేశారు.

# ముగియనున్న శకం..

## మెస్సీ, రొనాల్డో, నెయ్‌మార్‌లకు ఇదే ఆఖరి ప్రపంచకప్!

**ఫిఫా వరల్డ్ కప్ 2026 పలువురు దిగ్గజాలకు చివరి టోర్నీ - ఆఖరిసారి బరిలోకి దిగనున్న మెస్సీ, రొనాల్డో, మోద్రిచ్ వంటి స్టార్స్**

**2022 విజేతగా నిలిచిన మెస్సీ టైటిల్ నిలబెట్టుకోవాలని ఆశ - తన కెరీర్‌లో వరల్డ్ కప్ మాత్రమే గెలవని రొనాల్డోకు ఇది చివరి అవకాశం**

**ఇదే తన చివరి ప్రపంచకప్ అని బ్రెజిల్ స్టార్ నెయ్‌మార్ ఇప్పటికే ప్రకటన**



ఫిఫా ప్రపంచకప్ 2026 ఈ అర్ధరాత్రి తర్వాత ప్రారంభం కానున్న నేపథ్యంలో, ప్రపంచవ్యాప్తంగా ఫుట్‌బాల్ అభిమానుల్లో ఉత్కంఠ పెరుగుతోంది. మరపురాని క్షణాలు, నాటకీయ ముగింపులతో అభిమానులను అలరించే ఈ మెగా టోర్నమెంట్, ఈసారి ఒక శకానికి ముగింపు పలకనుంది. కొన్ని దశాబ్దాలుగా ఫుట్‌బాల్ ప్రపంచాన్ని ఏలిన ఎందరో దిగ్గజ ఆటగాళ్లకు ఇదే చివరి ప్రపంచకప్ కాబోతోంది. కోట్ల మందికి స్ఫూర్తినిచ్చిన ఈ తరం మేటి క్రీడాకారుల కెరీర్‌లో ఇది ఆఖరి అధ్యాయం కావచ్చు. వీరిలో కొందరు ఇప్పటికే ప్రపంచకప్ ట్రోఫీని ముద్దాడగా, మరికొందరు ఆ ఒక్క కల కోసం చివరిసారిగా పోరాడనున్నారు. ఈ నేపథ్యంలో, 2026 ప్రపంచకప్‌తో తమ కెరీర్‌కు ముగింపు పలకనున్న ఐదుగురు లెజెండరీ ఆటగాళ్లపై ఓ ప్రత్యేక కథనం.

**1. లియోనెల్ మెస్సీ (అర్జెంటీనా)**

2022లో అర్జెంటీనాకు ప్రపంచకప్ అందించి, ఫుట్‌బాల్ చరిత్రలో తనకంటూ ఒక సువర్ణాధ్యాయాన్ని లిఖించుకున్నాడు లియోనెల్ మెస్సీ. ఎనిమిది సార్లు బాలన్ డి'ఓర్ అవార్డు గెలుచుకున్న ఈ దిగ్గజ ఆటగాడికి బహుశా ఇదే చివరి ప్రపంచకప్ కానుంది. ఖతార్‌లో తన చిరకాల కలను నెరవేర్చుకున్న మెస్సీ, ఇప్పుడు మరో చారిత్రక ఘనతపై కన్నేశాడు. 1962లో బ్రెజిల్ తర్వాత వరుసగా రెండుసార్లు ప్రపంచకప్ గెలిచిన జట్టుగా అర్జెంటీనాను నిలబెట్టేందుకు సిద్ధమవుతున్నాడు. ఈ టోర్నీలో అర్జెంటీనా ప్రయాణం ఎలా సాగినా, ఫుట్‌బాల్ చరిత్రలో అత్యుత్తమ ఆటగాళ్లలో ఒకడిగా మెస్సీ స్థానం పదిలంగా ఉంటుంది.

**2. క్రిస్టియానో రొనాల్డో (పోర్చుగల్)**

రెండు దశాబ్దాలకు పైగా అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో తనదైన ముద్ర వేసిన క్రిస్టియానో రొనాల్డో, ఇప్పటికీ తన దేశానికి అతిపెద్ద స్ఫూర్తిగా నిలుస్తున్నాడు. తన కెరీర్‌లో సాధించాల్సిన ట్రోఫీలన్నీ గెలిచినా, ప్రపంచకప్ మాత్రం అతనికి అందని ద్రాక్షగానే మిగిలిపోయింది. ఈ నేపథ్యంలో, 41 ఏళ్ల వయసులో బరిలోకి దిగుతున్న రొనాల్డోకు తన కలను నెరవేర్చుకోవడానికి ఇది చివరి అవకాశం. ప్రపంచకప్ వేదికపై అతను ఆడే ప్రతి మ్యాచ్ ఆఖరిది కావచ్చనే భావనతోనే ఈ టోర్నీలో ఆడనున్నాడు.

**3. లూకా మోద్రిచ్ (క్రొయేషియా)**

క్రొయేషియాను ఒక ఫుట్‌బాల్ శక్తిగా నిలబెట్టడంలో లూకా మోద్రిచ్ పాత్ర కీలకం. 2018లో జట్టును ఫైనల్స్‌కు చేర్చడం నుంచి 2022లో మూడో స్థానంలో నిలపడం వరకు, క్లిష్ట సమయాల్లో అద్భుత ప్రదర్శన చేశాడు. ఇప్పటికే 40 ఏళ్ల వయసులో ఉన్న మోద్రిచ్, ఇప్పటికీ క్రొయేషియా జట్టుకు నాయకుడిగా, క్రియేటివ్ ఫోర్స్‌గా కొనసాగుతున్నాడు. 2026 ప్రపంచకప్‌లో జట్టును మరోసారి విజయపథంలో నడిపిస్తే, ఫుట్‌బాల్ చరిత్రలోని అత్యుత్తమ మిడ్‌ఫీల్డర్లలో ఒకడైన అతనికి అది సరైన వీడ్కోలు అవుతుంది.

**4. థామస్ ముల్లర్ (జర్మనీ)**

2014లో ప్రపంచకప్ గెలిచిన జర్మనీ జట్టులో కీలక సభ్యుడైన థామస్ ముల్లర్, టోర్నమెంట్లలో ఒత్తిడిని జయించడంలో సిద్ధహస్తుడు. తన తెలివైన ఆటతీరు, కదలికలతో దశాబ్దానికి పైగా అభిమానుల మనసు గెలుచుకున్నాడు. ఫుట్‌బాల్ అగ్రశ్రేణిలో తమ స్థానాన్ని తిరిగి నిలబెట్టుకోవాలని చూస్తున్న జర్మనీకి, 36 ఏళ్ల ముల్లర్ అనుభవం ఎంతో కీలకం. ఈ టోర్నీతో తన కెరీర్‌కు ఘనమైన ముగింపు పలకాలని అతను భావిస్తున్నాడు.

**5. నెయ్‌మార్ (బ్రెజిల్)**

బ్రెజిల్ స్టార్ ఫార్వర్డ్ నెయ్‌మార్, 2026 ప్రపంచకప్ తన కెరీర్‌లో చివరిదని ఇప్పటికే సంకేతాలిచ్చాడు. ఫిఫా సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన అతని కెరీర్ ఫొటోలకు బదులిస్తూ, 'ది లాస్ట్ డ్యాన్స్'(ఇదే చివరిసారి) అని కామెంట్ చేశాడు. 128 అంతర్జాతీయ మ్యాచ్‌లలో 79 గోల్స్‌తో బ్రెజిల్ తరఫున ఆల్-టైమ్ టాప్ స్కోరర్‌గా ఉన్న 34 ఏళ్ల నెయ్‌మార్, 2023 అక్టోబర్‌లో గాయపడిన తర్వాత జట్టుకు దూరమయ్యాడు. అయితే, అతను జట్టులోకి తిరిగి చేరి, గత 24 ఏళ్లుగా ఆరో ప్రపంచకప్ కోసం ఎదురుచూస్తున్న బ్రెజిల్ కలను నెరవేర్చాలని పట్టుదలతో ఉన్నాడు.

## తమిళనాట ఉప ఎన్నికల సందడి.. సన్నాహాలు ప్రారంభించిన ఈసీ

**5 అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు - సన్నాహక ఏర్పాట్లు ప్రారంభించిన భారత ఎన్నికల సంఘం**

**సీఎం విజయ్ రాజీనామాతో ఖాళీ అయిన తిరుచ్చి ఈస్ట్ స్థానం**

**అన్నా డీఎంకే ఎమ్మెల్యేల రాజీనామాలతో మరో నాలుగు చోట్ల ఖాళీలు**





తమిళనాడులో ఖాళీగా ఉన్న ఐదు అసెంబ్లీ నియోజక వర్గాలకు ఉప ఎన్నికలు నిర్వహించే ందుకు భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) ప్రాథమిక ఏర్పాట్లు ప్రారంభించింది. ముఖ్యమంత్రి సహా పలువురు ఎమ్మెల్యేల రాజీనామాలతో ఈ స్థానాలు ఖాళీ అయ్యాయి.

ఇటీవలి ఎన్నికల్లో తిరుచ్చి ఈస్ట్, పెరంబూర్ స్థానాల నుంచి గెలిచిన విజయ్.. నిబంధనల ప్రకారం తిరుచ్చి ఈస్ట్ స్థానానికి రాజీనామా చేశారు. దీంతో ఆ స్థానం ఖాళీ అయింది. దీనికి తోడు, టీఎంసీ ప్రభుత్వానికి విశ్వాస పరీక్షలో మద్దతిచ్చిన నలుగురు అన్నాడీఎంకే ఎమ్మెల్యేలు ఎస్.జయకుమార్ (పెరందురై), మరగతం కుమరవేల్ (మధురాంతకం), పి.సత్యభామ (ధారపురం), ఇసక్కి సుబ్బయ్య (అంబసముద్రం) తమ పదవులకు రాజీనామా చేసి అధికార పార్టీలో చేరారు. దీంతో మరో నాలుగు స్థానాలు ఖాళీ అయ్యాయి. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘం క్షేత్రస్థాయిలో ఏర్పాట్లు మొదలు పెట్టింది. జూన్ 22 నాటికి అన్ని సన్నాహక ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారులను ఈసీ ఆదేశించింది. ఐదు నియోజకవర్గాలకు రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులను కూడా నియమించింది. పరిపాలన, లాజిస్టిక్స్ అంశాలను సమీక్షించిన తర్వాత, రాబోయే వారాల్లో ఉప ఎన్నికల షెడ్యూల్‌పై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది.

## భారతీయులున్న నౌకపై యూఎస్ దాడి: భారత్ తీవ్ర నిరసన.. అమెరికన్ దౌత్యవేత్తకు సమన్లు

**ఒమన్ గల్ఫ్‌లో ఆయిల్ ట్యాంకర్‌పై అమెరికా దాడి - నౌకలో 24 మంది భారత సిబ్బంది.. 21 మంది సురక్షితం**

**దాడిని ఖండిస్తూ అమెరికా దౌత్యవేత్తకు భారత్ సమన్లు - గల్లంతైన ముగ్గురి కోసం కొనసాగుతున్న గాలింపు చర్యలు**



పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో, 24 మంది భారత సిబ్బంది ఉన్న వాణిజ్య నౌకపై అమెరికా బలగాలు జరిపిన దాడిని భారత్ తీవ్రంగా పరిగణించింది. ఈ ఘటనపై నిరసన వ్యక్తం చేస్తూ న్యూఢిల్లీలోని అమెరికా రాయబార కార్యాలయ సీనియర్ దౌత్యవేత్తకు బుధవారం సమన్లు జారీ చేసింది. ఒమన్ గల్ఫ్‌లో జరిగిన ఈ ఘటనలో 21 మంది సిబ్బంది క్షేమంగా బయటపడగా, మరో ముగ్గురి ఆచూకీ ఇంకా లభించలేదని విదేశాంగ శాఖ అధికారికంగా వెల్లడించింది. పలావు జెండాతో ఉన్న 'ఎంటీ మారివెక్స్' అనే ఆయిల్ ట్యాంకర్‌ను లక్ష్యంగా చేసుకుని అమెరికా ఈ దాడికి పాల్పడింది. ఇరాన్‌పై విధించిన ఆంక్షలను ఉల్లంఘించి ఆ నౌక ప్రయాణించిందని, తమ ఆదేశాలను పాటించకపోవడంతో ఇంజిన్ రూమ్‌ను ధ్వంసం చేసేందుకు దాడి చేయాల్సి వచ్చిందని యూఎస్ సెంట్రల్ కమాండ్ (సెంట్‌కామ్) ప్రకటించింది. యూఎస్ఎస్ అబ్రహం లింకన్ యుద్ధనౌక నుంచి బయలుదేరిన ఎఫ్-18 ఫైటర్ జెట్ ఈ దాడిలో పాల్గొన్నట్లు తెలుస్తోంది. దాడి జరిగిన తరుణంలో నౌకలోని భారత సిబ్బంది పంపిన అత్యవసర సందేశాలు ఆందోళన తీవ్ర ఆందోళన కలిగించాయి. "మా నౌకపై అమెరికా నేవీ క్షిపణి దాడి చేసింది. దీనివల్ల ఇంజిన్ రూమ్ దెబ్బతినడమే కాకుండా, నౌక కింద భాగంలో రంధ్రం పడింది. మేమంతా 24 మంది భారతీయ సిబ్బంది ఉన్నాం, దయచేసి త్వరగా మమ్మల్ని రక్షించండి" అంటూ వారు వేడుకున్నారు. ఈ సమాచారం అందిన వెంటనే స్పందించిన ఒమన్ నావికాదళ, హెలికాప్టర్ల ద్వారా సిబ్బందిని సురక్షిత ప్రాంతాలకు తరలించింది. ఈ పరిణామాలను భారత విదేశాంగ శాఖ నిరంతరం పర్యవేక్షిస్తోంది. గల్లంతైన ముగ్గురు సిబ్బంది కోసం ఒమన్ అధికారుల సమన్వయంతో గాలింపు చర్యలను ముమ్మరం చేసినట్లు వెల్లడించింది. సమస్యాత్మక జలాల్లో ప్రయాణించే భారతీయ పౌరులు, వాణిజ్య నౌకల భద్రతకే తమ ప్రథమ ప్రాధాన్యత అని భారత్ స్పష్టం చేసింది. ఇరాన్‌తో నెలకొన్న విభేదాల నేపథ్యంలో అమెరికా ఆంక్షలను కఠినంగా అమలు చేస్తుండటంతో, ఈ ప్రాంతంలో తరచూ ఇటువంటి ఉద్రిక్త ఘటనలు చోటుచేసుకుంటున్నాయి.

# సినిమా న్యూస్



ఆకర్షణీయమైన పాస్టెల్ సమ్మర్ దుస్తులలో జియా శంకర్ మెరుపులు: నటి జియా శంకర్ (జియా శంకర్ అని కూడా పిలుస్తారు) పాస్టెల్ పసుపు రంగు ఫ్లోరల్ బ్రాలెట్, సేజ్ గ్రీన్ మినీ స్కర్ట్ మరియు లేత గులాబీ రంగు క్రోచెట్ ష్రగ్‌తో కూడిన ఆకర్షణీయమైన సమ్మర్ దుస్తులలో అద్భుతంగా కనిపించారు.

## ఈ సెన్సేషనల్ సినిమా అసలు చెప్పాలనుకున్నది ఇదేనా?



హాలీవుడ్ చిత్రం అబ్సెషన్ ఈ ఏడాది ఊహించని స్థాయిలో విజయాన్ని సాధించింది. తక్కువ బడ్జెట్‌తో రూపొందిన ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా రూ.1500 కోట్లకు పైగా వసూళ్లు సాధించిందని సినీ వర్గాలు చెబుతున్నాయి. అయితే ఈ సినిమా విజయానికి కారణం కేవలం హారర్ లేదా థ్రిల్లర్ అంశాలు మాత్రమే కాదు. ఒక్కో ప్రేక్షకుడు ఈ కథను ఒక్కో విధంగా అర్థం చేసుకోవడమే దీనికి ప్రధాన బలం. సింపుల్ కథ.. కానీ ఎన్నో అర్థాలు కథ చాలా సాధారణంగా కనిపిస్తుంది. బేర్ అనే యువకుడు నిక్కీ అనే అమ్మాయిని ప్రేమిస్తాడు. కానీ తన ప్రేమను ఆమెకు ఎప్పుడూ నేరుగా చెప్పలేడు. మరోవైపు నిక్కీ మాత్రం బేర్‌ను అన్నలాంటి వ్యక్తిగా భావిస్తుంది. అతనిపై పూర్తి నమ్మకం ఉంచుతుంది. తన ప్రేమను చెప్పే ధైర్యం లేని బేర్, ఒక మాయా దిండును ఉపయోగించి నిక్కీ తనను ప్రపంచంలో ఎవరికంటే ఎక్కువగా ప్రేమించాలని కోరుకుం టాడు. ఆ కోరిక నిజమవుతుంది. ఆ తర్వాత నిక్కీ ప్రేమ సాధారణ స్థాయిని దాటి అబ్సెషన్‌గా మారిపోతుంది. అక్కడి నుంచే కథ అసలు మలుపు తిరుగుతుంది. ఈ సినిమాలో కనిపించే మొదటి సందేశం చాలా ఆసక్తికరంగా ఉంటుంది. కొంత మంది ఇతరుల ప్రేమ, శ్రద్ధ, అభిమానాన్ని కోరు కుంటారు. కానీ అదే ప్రేమను తిరిగి ఇవ్వడానికి సిద్ధంగా ఉండరు. బేర్ కూడా అలాంటి వ్యక్తిగానే కనిపిస్తాడు. అతను నిక్కీ ప్రేమను కోరుకున్నాడు. కానీ ఆమె తనపై పూర్తిగా ఆధారపడిపోయిన తర్వాత ఆ ప్రేమ తీవ్రతను తట్టుకోలేకపోయాడు. అబ్బాయిలు, అమ్మాయిలు చాలా ప్రశాంతంగా, దూరంగా ఉంటారు. అయినా ఎదుటివారిని తమవైపు ఆకర్షిస్తారు. మొదట్లో వాళ్ళు తమని ఎక్కువగా ప్రేమించేలాగా చేసుకుంటారు. కానీ ఒకసారి ఒక అమ్మాయి, అబ్బాయితో విపరీతంగా ప్రేమలో పడిపోయిన తర్వాత, తమకోసం వారు ఎంతగా ఆలోచిస్తున్నారో, ఎంతగా ప్రేమిస్తున్నారో తెలుసుకుని కూడా పట్టించుకోనట్లు ప్రవర్తిస్తారు. ఈ విషయాన్ని సినిమా చాలా బలంగా చూపిస్తుంది. బేర్ నిక్కీ ప్రేమను కోరుకున్నాడు. కానీ ఆ ప్రేమ నిజంగా తన జీవితంలోకి వచ్చినప్పుడు దాన్ని అంగీకరించలేకపోయాడు. దీనివల్ల "ఒకరిని మనపై భావోద్వేగంగా ఆధారపడేలా చేసి, ఆ తర్వాత వారి భావాలను పట్టించుకోకపోవడం కూడా ఒక రకమైన ప్రమాదమే" అనే సందేశాన్ని సినిమా ఇస్తున్నట్లు అనిపిస్తుంది.: హద్దులు దాటిన సంబంధాలపై మరో కోణం ఈ సినిమాలో రెండో కోణం కొన్ని చీకటి నిజాలను చూపించేలా ఉంటుంది. మొదట్లో నిక్కీ బేర్‌ను అన్నలాగా చూస్తుంది. అతనిపై పూర్తి నమ్మకం ఉంచుతుంది. బేర్‌కు కూడా ఈ విషయం బాగా తెలుసు. అయితే ఆమె భావాలను అంగీకరించే బదులు, వాటిని మార్చడానికి అతను ాలవ ఔంఅంష్త్ర ఆయుధాన్ని ఉపయోగిస్తాడు. దీంతో నిక్కీ ప్రేమలో పడుతుంది. తర్వాత అతనితో ఒకే మంచం పంచుకునే స్థాయికి చేరుతుంది. ఈ కోణంలో చూస్తే సినిమా కేవలం ప్రేమ కథ కాదు. ఒకరి భావాలను బలవంతంగా మార్చడం ఎంత ప్రమాదకరమో చెప్పే కథగా మారుతుంది. నేటిసమాజంలో కూడా బంధాల హద్దులను దాటేసంఘటనలు తరచూ వార్తల్లో కనిపిస్తున్నాయి. అక్క తమ్ముడు, అన్నా చెల్లెలు, అత్త అల్లుడు అనే బంధాలను కూడా ఇప్పుడు ఎంతోమంది ఎంత నీచంగా చూస్తున్నారో మనం తరచు వార్తల్లో వింటూనే ఉంటా. అన్నాచెల్లెళ్లలా, కుటుంబ సభ్యుల్లా లేదా నమ్మకమైన వ్యక్తుల్లా కనిపించే కొందరు, ఆ నమ్మకాన్ని స్వార్థ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవడం చూస్తుంటాం. సినిమా నేరుగా ఈ విషయాల గురించి మాట్లాడకపోయినా, బేర్ పాత్ర ద్వారా అలాంటి ప్రమాదకరమైన ఆలోచనలపై హెచ్చరిక చేసినట్లు అనిపిస్తుంది. నిక్కీ తనను ఆ కోణంలో చూడదని తెలిసినా, ఆమె భావాలను మార్చాలని ప్రయత్నించడం ద్వారా వ్యక్తిగత కోరికల కోసం ఒకరి స్వేచ్ఛను ఎలా దెబ్బతీయవచ్చో చూపిం చింది. ప్రేమే రాక్షసిగా మారితే... ఈ సినిమాలో అత్యంత ముఖ్యమైన సందేశం ప్రేమ గురించి ఇచ్చా రని చెప్పవచ్చు. సాధారణంగా హారర్ సినిమాల్లో భూతాలు లేదా దెయ్యాలు ప్రేక్షకులను భయపెడ తాయి. కానీ అబ్సెషన్లో మాత్రం ప్రేమే భయంకరమైన అంశంగా మారుతుంది. ప్రేమ అనేది అందమైన భావన. అది మనిషికి ఆనందాన్ని ఇస్తుంది. జీవితానికి అర్థాన్ని ఇస్తుంది. కానీ అదే ప్రేమ హద్దులు దాటితే ప్రమాదకరంగా మారవచ్చు. నిక్కీ విషయంలో కూడా అదే జరుగుతుంది. మొదట సాధారణ ప్రేమగా మొదలైన భావన క్రమంగా అబ్సెషన్‌గా మారుతుంది. ప్రేమ కంటే స్వాధీనం చేసుకోవాలనే కోరిక ఎక్కువవుతుంది. ఆ తర్వాత ఆమె ఆలోచనలు, ప్రవర్తన అన్నీ మారిపోతాయి. ఈ మార్పు ప్రేక్షకులకు భయాన్ని కలిగిస్తుంది. ఎందుకంటే సినిమాలో కనిపించే రాక్షసుడు ఎవరూ కాదు. నియంత్రణ కోల్పోయిన ఒక భావోద్వేగమే. అలానే ఒక మనిషిపై ఉన్న పిచ్చి ప్రేమ. ఒక్కో ప్రేక్షకుడికి ఒక్కో అర్థం..! ఈ సినిమా గొప్పతనం కూడా ఇక్కడే ఉంది. కొందరు బేర్‌ను విలన్‌గా చూస్తారు. మరికొందరు నిక్కీని బాధితురాలిగా చూస్తారు. ఇంకొందరు దీన్ని కేవలం ఒక హారర్ థ్రిల్లర్‌గా ఆస్వాదిస్తారు. సరైన అర్థం ఇదే అని చెప్పలేం. ఒక్కో ప్రేక్షకుడు తన అనుభవాలు, ఆలోచనల ఆధారంగా కథను అర్థం చేసుకుంటాడు. అందుకే అబ్సెషన్ ప్రపంచవ్యాప్తంగా పెద్ద విజయాన్ని సాధించింది. కథ సింపుల్‌గా ఉన్నా, దాని వెనుక ఉన్న భావాలు మాత్రం చాలా లోతుగా ఉంటాయి. ప్రేమ, బాధ్యత, నమ్మకం, బంధాల హద్దులు, అబ్సెషన్ వంటి అంశాల గురించి ప్రేక్షకులను ఆలోచింపజేస్తుంది. చివరికి అబ్సెషన్ మనకు ఒక ముఖ్యమైన విషయాన్ని గుర్తు చేస్తుంది. ప్రేమ అందంగా ఉంటుంది. కానీ అది ఆలోచన కోల్పోయినప్పుడు ప్రమాదకరంగా మారుతుంది. కొన్నిసార్లు చీకట్లో దాగి ఉన్న దెయ్యాల కంటే నియంత్రణ కోల్పోయిన భావోద్వేగాలే ఎక్కువ భయాన్ని కలిగిస్తాయి. అందుకే ఈ సినిమా కేవలం హారర్ కథగా కాకుండా, ప్రేమ, బాధ్యత, భావోద్వేగాలు, సంబంధాల గురించి లోతుగా ఆలోచింపజేసే చిత్రంగా నిలిచిపోయింది.

## పెద్ది కోసం జగ్గూభాయ్ స్పీడ్.. రీజనేంటి?



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, బుచ్చిబాబు సనా దర్శకత్వంలో తెరకెక్కిన పెద్ది మూవీ బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు సాధిస్తూ సందడి చేస్తోంది. అదే సమయంలో మరో విషయం కూడా హాట్ టాపిక్ గా మారింది. అదే.. ప్రమోషన్లలో జగపతిబాబు స్పీడ్. నిజానికి జగపతిబాబు ఎక్కువగా ప్రమోషన్లలో కనపడరు. సినిమా విడుదల సమయంలో ఒకటి రెండు కార్యక్రమాలకు మాత్రమే వస్తారు. కానీ పెద్ది విషయంలో మాత్రం పరిస్థితి పూర్తిగా భిన్నంగా కనిపించింది. సినిమా విడుదలకు ముందు నుంచే ప్రమోషన్లలో యాక్టివ్ గా పాల్గొన్నారు. రిలీజ్ తర్వాత కూడా బిజీబిజీగా గడుపుతున్నారు. దీంతో జగ్గూభాయ్ ఇంతగా ప్రమోషన్ల బాధ్యత తీసుకోవడానికి కారణమేంటనే చర్చ మొదలైంది. దీనికి ప్రధాన కారణం ఆయన పోషించిన అప్పలసూరి పాత్రేనని టాక్ వినిపిస్తోంది. సినిమాలో ఆయన గుబురు గడ్డం, కొత్త మేకోవర్ తో గుర్తుపట్టలేని విధంగా కనిపించారు. కేవలం లుక్ మాత్రమే కాదు.. యాక్టింగ్ పరంగా కూడా ఆ రోల్ ఆయనకు స్పెషల్ ఎక్స్పీరియన్స్ ఇచ్చిందని తెలుస్తోంది. లెజెండ్ తర్వాత ఎక్కువగా విలన్ పాత్రలు, సీరియస్ క్యారెక్టర్లు చేశానని జగపతిబాబు పలు ఇంటర్వ్యూల్లో చెప్పారు. కానీ పెద్దిలో మాత్రం ప్రేక్షకుల హృదయాలను తాకే ఎమోషన్స్ ఉన్న పాత్ర దొరికిందని వెల్లడించారు. ఒక నటుడిగా తనలోని మరో యాంగిల్ చూపించే అవకాశం రోల్ ఇచ్చిందని ఆయన అభిప్రాయపడ్డారు. అందుకే ఆ పాత్రను ప్రేక్షకుల్లోకి మరింత గట్టిగా తీసుకెళ్లాలనే ఉద్దేశంతో ప్రమోషన్లలో పాల్గొంటున్నారని తెలుస్తోంది. మరోవైపు హీరో రామ్ చరణ్ పై ఉన్న ఒత్తిడిని తగ్గించాలనే ఆలోచన కూడా కనిపించింది. సినిమా కోసం చరణ్ ఎంతో కష్టపడ్డారని, షూటింగ్ సమయంలో గాయాలైనా వెనక్కి తగ్గకుండా పనిచేశారని జగపతిబాబు చెప్పారు. విడుదల సమయానికి డబ్బింగ్, సెన్సార్, ఇతర పనులతో చరణ్ బిజీగా ఉండటంతో ప్రమోషన్ల బాధ్యతలో కొంత భాగాన్ని ఆయన తీసుకున్నట్లు టాక్ వినిపిస్తోంది. పెద్దన్నలా మూవీ టీమ్ కు అండగా నిలిచినట్లు తెలుస్తోంది. సినిమా విడుదల తర్వాత వచ్చిన కొన్ని నెగటివ్ కామెంట్లు, సోషల్ మీడియా ట్రోల్స్ పై కూడా జగపతిబాబు తనదైన శైలిలో స్పందించారు. విమర్శలకు భయపడకుండా సినిమా టీమ్ కు మద్దతుగా నిలబడ్డారు. అవసరమైన ప్రతిసారి ఓపెన్ గానే మాట్లాడారు. సినిమాపై ఎక్కడైనా నెగిటివ్ క్యాంపెయిన్ జరిగినా, దానికి ఆన్సర్ చెప్పడంలో వెనుకడుగు వేయలేదు. అయితే అన్నింటికంటే ముఖ్యమైన కారణం వర్క్ పై ఆయనకున్న లవ్ అని చెప్పాలి. ఖాళీగా ఉండటం తనకు ఇష్టం ఉండదని, ప్రతిరోజూ ఏదో ఒక సినిమా పనిలో ఉండాలని అనిపిస్తుందని జగపతిబాబు గతంలో చెప్పిన మాటలు ఇప్పుడు గుర్తుకు వస్తున్నాయి. ఇప్పుడు పెద్ది విజయం ఆయనలో మరింత జోష్ నింపింది. అందుకే వయసుతో సంబంధం లేకుండా అదే ఎనర్జీతో ప్రమోషన్లలో పాల్గొంటూ అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. ఏదేమైనా పెద్ది ప్రమోషన్లలో జగపతిబాబు తీరు చూస్తే.. తనకు ఎంతో నచ్చిన అప్పలసూరి పాత్రపై ఉన్న ప్రేమ, చరణ్ తోపాటు టీమ్ కు అండగా నిలవాలనే బాధ్యత, వర్క్ పై డెడికేషన్.. ఆ మూడు కారణాలే ఆయనను సినిమాకు మెయిన్ పిల్లర్ మార్చాయని చెప్పాలి. అందుకే పెద్ది ప్రమోషన్లలో జగ్గూభాయ్ వన్ మ్యాన్ షో చేస్తున్నట్లు వినికిడి.

## విశ్వక్ కు గీతా ఆర్ట్స్ ఆఫర్.. అల్లు అరవింద్ క్లారిటీ!



దీవానా మూవీ ట్రైలర్ లాంచ్ ఈవెంట్ లో విశ్వక్ సేన్, అల్లు అరవింద్ ల మధ్య జరిగిన సరదా సంభాషణ ఇప్పుడు నెట్టింట ట్రెండ్ అవుతోంది. గీతా ఆర్ట్స్ బ్యానర్ లో సినిమా చేసే అవకాశం కోసం విశ్వక్ సేన్ నేరుగా అల్లు అరవింద్ ను అడగడం ఈవెంట్ కు హైలైట్ గా నిలిచింది. దీనిపై అల్లు అరవింద్ కూడా అంతే స్పోర్టివ్ గా రియాక్ట్ అయ్యి, ఆసక్తికరమైన కామెంట్స్ చేశారు. విశ్వక్ కు, తనకు మధ్య గత ఐదారేళ్లుగా సినిమా చేయాలనే చర్చ నడుస్తోందని అల్లు అరవింద్ వెల్లడించారు. విశ్వక్ ఒకసారి అడుగుతాడు, ఆ తర్వాత మర్చిపోతాడు, అలాగే నేను కూడా అడుగుతాను, తర్వాత మర్చిపోతాను అంటూ సరదాగా చెప్పుకొచ్చారు. ఎప్పుడో ఒకసారి కలుసుకున్నప్పుడు మాత్రమే సినిమా గురించి మాట్లాడుకుంటామని, కానీ ఇప్పటి వరకు అది మెటీరియలైజ్ కాలేదని ఆయన అన్నారు. విశ్వక్ రెమ్యునరేషన్ గురించి కూడా అల్లు అరవింద్ ఫన్నీ కామెంట్స్ చేశారు. "ఇప్పుడు అడ్వాన్స్ ఇస్తారా అంతేనా?" అని విశ్వక్ అడగగా, "నువ్వు డబ్బులు ఎంత తీసుకుంటావో చెప్తే, ఇస్తా" అని అల్లు అరవింద్ కౌంటర్ వేశారు. ఈ సరదా సంభాషణ ఈవెంట్ లో ఉన్న వాళ్లందరినీ కడుపుబ్బా నవ్వించింది. విశ్వక్ తో సినిమా చేయాలని తనకెప్పుడూ ఉంటుందని, కానీ టైమ్ రావడం లేదని అల్లు అరవింద్ అన్నారు. అయితే త్వరలోనే ఆ టైమ్ వస్తుందని, కచ్చితంగా విశ్వక్ తో సినిమా చేస్తామని ఆయన క్లారిటీ ఇచ్చారు. అంతే కాకుండా "ఆలస్యం అమృతం" అని బదులిస్తూ, మంచి ప్రాజెక్ట్ తో వస్తామని సూచించారు. ఇలా దీవానా ఈవెంట్ వేదికగా విశ్వక్, అల్లు అరవింద్ ల మధ్య జరిగిన ఈ సంభాషణ, గీతా ఆర్ట్స్ లో విశ్వక్ మూవీ త్వరలోనే ఉండబోతోందన్న క్లారిటీని ఇచ్చింది. ఈ క్రేజీ కాంబో కోసం అభిమానులు కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది. చాలా రోజులుగా అల్లు అరవింద్ పెద్ద బడ్జెట్ సినిమాలకు దూరంగానే ఉంటున్నారు. చిన్న సీనుమాలు మీడియం రేంజ్ సినిమాలు చేస్తున్నారు. ముఖ్యంగా ఆూ2 లో ప్రయోగాలు చేస్తున్న విషయం తెలిసిందే. ఇక అప్పుడప్పుడు విశ్వక్ సేన్ లాంటి టాలెంటెడ్ హీరోలతో కూడా సినిమాలు చేసే ప్రయత్నం చేస్తున్నారు. ఇక ఎప్పటి నుంచో చర్చల్లో ఉన్న ఈ కాంబినేషన్ మళ్ళీ సెట్స్ పైకి వస్తుందో లేదో చూడాలి.

Printed by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Published by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Owned by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Printed at:SINDHURA DARSINI PUBLICATION, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Editor: KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Email:SINDHURADARSINI.2023@Gmail.com, Cell:7569677170,RNI/APTEL/2023/87662